

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 06 | సంచిక 94 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 25, ఫిబ్రవరి 2025 | పేజీలు 9 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగలూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


## ఇసుక తవ్వకాలు..

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోలేకపోతున్న అధికారులు

# ఇంకెంతకాలం ?







### స్థానిక మైనింగ్ రెవెన్యూ పోలీస్ అధికారులు పైసలకు అమ్ముడుపోతున్నారా.!?

దామెర గ్రామం గిద్దకుంటలో
ఆరు నెలలుగా ఇసుక తవ్వకాలు
దొంగతనంగా తవ్వకాలను దొరదనంలా
కొనసాగిస్తున్నారు
మైనింగ్ వ్యాపారస్తుల ఆగడాలపై చర్యలు ఎక్కడ
సిపి అంబర్ కిషోర్ ఝా సార్ దామెర గ్రామం
ఇసుక దొంగలపై చర్యలు తీసుకోండి
పైసా వ్యాపారంలో ప్రజల ప్రాణాలను
చిత్రహింసలు పెడుతున్నారు
సిగ్గుమాలిన అధికారులు డబ్బులకు
అమ్ముడు పోతున్నారు
డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అధికారులు కఠినతరం అంటుంటే ఇసుకతవ్వకాల మాఫియాదారులు యదేచ్ఛగా ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలోని హన్మకొండ జిల్లా దామెర మండలంలో సుమారుగా ఆరు నెలల పాటుగా ఇసుక తవ్వకాలను కొనసాగిస్తున్నారని హెచ్చరిస్తూ తవ్వుకున్నోనికి తవ్వుకున్నంత దోచుకున్నోడికి దోచుకున్నంత సులవుగా అక్రమ ఇసుక తవ్వకాల రవాణా వ్యాపారాలు కొనసాగుతున్నారని దానిని కట్టడి చేయాల్సిన అధికారులు డబ్బులకు అమ్ముడుపోతూ రాత్రింబగళ్లు కాపలదారుల్లా సహకరిస్తున్నారన్నారు. గ్రామస్తులు ఇరిగేషన్ మైనింగ్ అధికారులతో పాటు పోలీస్ అధికారులకు పలుమార్లు సమాచారం ఇవ్వడమే కాకుండా రాత్రుల పూట శబ్ద కాలుష్యంతో అనేక

- మిగతా 3లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## సీఎం ఆఫీస్‌లో అంబేద్కర్, భగత్ సింగ్ ఫోటోలు తొలగింపు

అసెంబ్లీలో ప్రతిపక్షాల మండిపాటు

ఢిల్లీ(జై భీమ్ న్యూస్)

ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే సభలో గందరగోళం నెలకొంది.ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్న అంబేద్కర్,భగత్ సింగ్‌ల ఫోటోలు తొలగించారని ఆరోపిస్తూ ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నిరసనకు దిగారు.ఈ సందర్భంగా మాజీ సీఎం ఆతిశీ.. రేఖా గుప్తా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.బీజేపీ దళిత వ్యతిరేక,సిక్కు వ్యతిరేక పార్టీ అని మరోసారి తేలిపోయిందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.



## ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఎన్నిక

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24((జై భీమ్ న్యూస్)) :

అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. అసెంబ్లీ సమావేశాలు సోమవారంనాడు ప్రారంభం కాగా, స్పీకర్ పదవికి విజేందర్ గుప్తా పేరును ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రతిపాదించారు. దీనికి బీజేపీ ఎమ్మెల్యే మంజిందర్ సింగ్ సిర్సా మద్దతు పలికారు. అనంతరం మూజువాణి ఓటుతో విజేందర్ గుప్తా ఎన్నికయ్యారు. సభా సంప్రదాయం ప్రకారం స్పీకర్‌గా విజేందర్ గుప్తా ఎన్నిక కాగానే ఆయనను ముఖ్యమంత్రి రేఖా గుప్తా, విపక్ష నేత సాదరంగా స్పీకర్ సీటు వరకూ తోడ్కొని వెళ్లారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులందరికి కంటే ఎక్కువ మెజారిటీతో విజేందర్ గుప్తా గెలిచారు. తన సమీప ఆప్ అభ్యర్థిపై 37,000 ఆధిక్యంతో ఆయన గెలుపొందారు. కాగా, సోమవారంనాడు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ అరవింద్ సింగ్ లవ్లీ చేత లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేయగా, క్యాబినెట్ మంత్రులు, ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు, ఆప్ ఎమ్మెల్యేలు వరుసగా ప్రమాణస్వీకారం చేశారు. ఒకవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆప్ ప్రయత్నాలు ప్రారంభించింది. మహిళలకు రూ. 2.500 ఆర్థిక సాయం ఇస్తామని ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేఖాగుప్తా కార్యాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి అతిషి, ఆప్ ఎమ్మెల్యేలకు నిరసనలకు దిగారు. మార్చి 8వ తేదీన తొలి ఇన్‌స్టాల్‌మెంట్ మహిళా లబ్దిదారులకు చేరాలని డిమాండ్ చేశారు.



## భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ






ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల
తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం
ముఖ్య అతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

ఎస్సీ వర్గీకరణలో జరిగిన లోపాలు,చేయాల్సిన సవరణల మీద చర్చించేందుకు ఎమ్మార్పీఎస్ మరియు అన్ని అనుబంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాద్ లోని డ్రీమ్ ల్యాండ్ గార్డెన్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా వెంకటేష్ నేత, డా. పృథ్విరాజ్ యాదవ్,సయ్యద్ ఇస్మాయిల్,హెూలియ దాసరి వెంకటేష్ ,జానకి రామయ్య చౌదరి,వేల్పుల సూరన్న గార్లు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణలో అందరికి న్యాయం జరిగేలా,మాదిగలకు రావాల్సిన తగిన వాటా సాధించుకునేల భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించడం మీద ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చ జరుగుతుంది. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అద్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా బిక్షపతి మాదిగ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహ మాదిగ స్వాగత ఉపన్యాసం చేశారు. హైదరాబాద్ జిల్లా నేతలు ఇటుక కిషన్,డప్పు మల్లిఖార్జున్ , రవి,అరుణ్, ఇంకా మరికొంత సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సమావేశ నిర్వహణలో పాలుపంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# సంపాదకీయం

## స్మార్ట్ ఫోన్ ప్రాణ మిత్రుడా!

స్మార్ట్ ఫోన్ లేని వాడు నేటి డిజిటల్ యుగపు మనిషే కాదు అనే విపరీతమైన రోజులు వచ్చాయి. ఇంటర్నెట్ వాడకపోతే మానసిక దిగులు పెరుగుతుంది. వాట్సాప్, ఫేస్‌బుక్‌లు చూడకపోతే ముద్ద దిగడం లేదు. స్మార్ట్ ఫోన్ జేబులో లేక పోతే క్షణం గడవడం లేదు. స్మార్ట్ ఫోన్‌ను ఇంట్లో మరచిపోతే ఊపిరి ఆగినంత పని అవుతుంది. అన్నింటి కన్నా స్మార్ట్ ఫోన్ మిన్న అయిపోయింది. ఇటీవల విదేశీ విశ్వవిద్యాలయం చేసిన సర్వేలో ఆసక్తికరమైన, ప్రమాదకరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. తమ ఆప్త మిత్రుల కన్న స్మార్ట్ ఫోన్ మిన్న అని 37 శాతం మంది అభిప్రాయపడగా, తమ తల్లిదండ్రుల కన్న స్మార్ట్ ఫోన్ ముఖ్యమని 29 శాతం యువత తెలుపడం మన స్మార్ట్ ఫోన్ బలహీనతను స్పష్టం చేస్తున్నది. మూడు నెలల పిల్లాడు సహితం స్మార్ట్ ఫోన్ బొమ్మ చూపకపోతే ముద్ద మింగడం లేదు. మన ముఖ్యమైన విధులను సహితం పక్కన పెట్టి స్మార్ట్ ఫోన్ సామాజిక మాధ్యమ సాగరంలో ఈదుతున్నాం. నేడో రేపో స్మార్ట్ ఫోన్ సొరచేపగా మారి మన భవిష్యత్తును మింగేయ చూస్తున్నది. స్మార్ట్ ఫోన్ ఎంత మాయ చేస్తున్నది ? నాతో నేను మాట్లాడడమే ఎప్పుడో మానేసా. అమ్మనాన్నలతో ముచ్చట్లు లేవు, స్నేహితులు పలుచబడుతున్నారు. ఒంటరితనం మానసిక వ్యాధిగా మారుతున్నది. చికాకు పెరుగుతున్నది. అన్నం తినాలని పించదు. మైదాన ఆటలు అంతరించి పోతున్నాయి. ఏకాగ్రత మంటగలుస్తున్నది. మానవ సంబంధాలు పలుచబడి పోతున్నాయి. భార్య సహితం పరాయి స్త్రీగా మిగిలి పోతున్నది. భార్యను భర్తకు, తల్లిని పిల్లకు, తండ్రిని కొడుక్కు, విద్యార్థిని చదువుకు దూరం చేస్తున్నది. తల్లితండ్రులు అవసరాలను తీర్చే యంత్రాలుగా మారిపోయారు. స్మార్ట్ ఫోన్ ప్రమాదకరంగా మారి మానసిక, సమయ ఒత్తిడిని పెంచుతూ, ఆదుర్దా, నిరాశ, అనవసర ఆవేశాలకు ఆజ్యం పోస్తున్నది. మన సాధారణ ప్రవర్తనను కొన్ని మాసాల్లో మార్చివేయగల అతి తెలివిగల ఎలక్ట్రానిక్ సాధనంగా స్మార్ట్ ఫోన్ ఫోజులు కొడుతున్నది. ముఖ్యమైన పనిలో నిమగ్నమైన మరు క్షణమే ఫోన్ రింగ్ లేదా సామాజిక మాధ్యమ అలెర్ట్స్ మన దృష్టిని లాగేసుకుంటున్నాయి. "ఆలిని వదలగలను కాని నా అందాల ఫోన్ సుందరిని వదలలేను" అనే అకాలాలు వచ్చాయి. మనీ పర్సు కూడా అవసరం లేదంటూ స్మార్ట్ ఫోన్ కాలర్ ఎగరేస్తున్నది, మనిషిని కట్టు బానిసను చేస్తున్నది. మన స్మార్ట్ ఫోన్ హిత శత్రువును జేబులో, టేబుల్ మీద, కప్ బోర్డులో లేదా చాలా దూరంగా పెట్టి మీ పనులు చేయడం ప్రారంభించండి. మీకే అర్థం అవుతుంది, ఏది మనకు విజయాన్ని, అధిక ఉత్పాదకతను పెంచుతుందో లేదా ఏది వైఫల్యాలను అంటకడుతుందో తెలుస్తుంది. స్మార్ట్ ఫోన్ జేబులో ఉన్నపుడు పని అసలే జరగదు. జేబుపై పెడితే 25 శాతం జరుగుతుంది. డ్రాలో వేస్తే 40 శాతం ఫలితాలు నమోదు అవుతాయి. దూరం పెడితే మన సామర్థ్యానికి తగిన గరిష్ట ఉత్పాదకత రికార్డు అవుతుంది, విజయాలను వెంట వెంటనే బహుకరిస్తుంది. అనగా ఫోన్ దూరం అయిన కొద్దీ విజయాలు మనకు దగ్గరవుతాయి. విధి నిర్వహణ లేదా చదుకునే సమయాల్లో స్మార్ట్ ఫోన్/సందేశాలు/కాల్స్ అందనంత దూరంగా, ఆఫ్ చేసి పెట్టండి. సన్నిహిత వాట్సాప్ గ్రూపుల మినహా ఇతర అనవసర గ్రూపుల నుండి తొలగిపోదాం. వార్తల యాప్‌లను సాయంత్రం వరకు దూరం పెడదాం. అతి ముఖ్యమైన కాల్స్ మాత్రమే చేద్దాం లేదా రిసీవ్ చేసుకుందాం. విడియో గేమ్స్, ఆడియో వ్యర్థ సమాచారాలకు దూరంగా ఉందాం. మనకు అత్యవసరం అనుకున్నపుడు మాత్రమే అవసర సమాచారం కోసం గూగులమ్మ తలుపులు తెరుద్దాం. ప్రతి అనవసర ప్రకటనలు లేదా సూచనలకు సమాధానాలు ఇవ్వవద్దు. అవసరమైన ఆడియో లేదా వీడియోలను మాత్రమే ఉపయోగిద్దాం. సామాజిక మాధ్యమాలు మన మెదడును తినేస్తున్నాయి. మనల్ని బుద్ధిహీనులుగా మారుస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ సాధనానికి స్వల్ప విరామమిచ్చి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, వ్యాయామానికి సమయం ఇవ్వడం, స్నేహితులతో అప్పుడప్పుడూ మాట్లాడడం, అమ్మనాన్నల ఆప్యాయతను రుచి చూడడం, భార్యతో కాలక్షేపం చేయటం, ఏకాగ్రతతో చదవడం లాంటివి చేసి చూడండి, మీకే తెలుస్తుంది మీ మనసు ఎంత తేలిక అవుతుందో, మానసిక ఒత్తిడి దిగిపోతుందో. అందరికీ రోజుకు 1440 నిమిషాలు, 86,400 సెకన్ల సమయం మాత్రమే ఉంది. మీరు దీనిలో ఎంత సమయం స్మార్ట్ ఫోన్ వినియోగానికి వెచ్చిస్తున్నారో అంచనా వేయండి. కొంత మంది 500 నుండి 600 నిమిషాల వరకు ఫోన్‌తోనే సంసారం తేస్తున్నారు. వీరికి అపజయాలు నిర్ధారణ అయినాయి. ఫోన్‌ను పక్కన పెట్టి పనిపై ఏకగ్రత పెంచండి. ఫోన్లో వ్యాసాలు/పుస్తకాలు చదవండి, విద్య విషయాలు సేకరించండి, ఆధునిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొండి. స్మార్ట్ ఫోన్ అంటే అందరికీ ఇష్టమే, కాని అది మన భవిష్యత్తును పాతాళంలోకి నెట్టకుండా చూసుకొండి. ఫోన్ యాప్ ఆవిష్కర్తలు చాలా తెలివైన వారు. మన ఏకాగ్రతకు తెలియకుండానే గాలం వేసి లాగేసుకోగలవు. స్మార్ట్ ఫోన్ పై పరిమిత ప్రేమను పెంచుకోండి. మన ఉత్పాదకత మన ధ్యాస మీదనే ఆధారపడుతుంది. మన ధ్యాసను ఫోన్ ధ్వసం చేసి మనల్ని చేతగాని వాడిగా మారుస్తుంది. మన ధ్యాసను మన అదుపులో పెట్టుకోవడానికి స్మార్ట్ ఫోన్‌కు పని వేళల్లో తాత్కాలికంగా విడాకులు ఇవ్వండి. జీవితాలను విజయ తోరణాలతో నింపేయండి. స్మార్ట్ ఫోన్ సాధనాన్ని స్మార్ట్‌గా వాడండి, స్మార్ట్‌గా సమాజంలో/చదువుల్లో/విధి నిర్వహణలో పేరు తెచ్చుకోండి.

## బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

పాట్నా : బీహార్‌లో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాట్నాలోని మసౌర్హిలోని నూరా వంతెనపై ట్రక్కు, టెంపో వాహనాలు రెండు ఢకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై మసౌర్హి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఓ) సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆదివారం రాత్రి నూరా బ్రిడ్జిపై జరిగిన ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాము. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో టెంపో, ట్రక్కు రెండు వాహనాలు వంతెనపై నుండి పడిపోయాయి. వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో హుటాహుటిన ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు' అని ఆయన అన్నారు.

## బిజెపి ఎంపిపై పరువు నష్టం

### కేసులో విచారణ వాయిదా

న్యూఢిల్లీ : బిజెపి ఎంపిపై ఆప్ నేత సత్యేందర్ జైన్ దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం కేసు విచారణను స్థానిక రోహిణీ కోర్టు వాయిదా వేసింది. సంబంధిత జడ్జి నైనా గుప్తా శనివారం సెలవు తీసుకోవడంతో విచారణ వాయిదా పడిందని, ఈ కేసును జులై 14న విచారణకు జాబితా చేశామని కోర్టు తెలిపింది. సత్యేందర్ జైన్ నివాసం నుండి రూ.3 కోట్ల నగదు, 1.8 కిలోల బంగారం, 133 బంగారు నాణేలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్వాధీనం చేసుకుందని 2023 అక్టోబర్‌లో ఒక టివి చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో బిజెపి నేత బన్సూరీ స్వరాజ్ ఆరోపించారు. తనను అవమానపరిచేందుకు, రాజకీయ లబ్ధి పొందేందుకు బన్సూరీ ఈ వ్యాఖ్యలు చేశారని జైన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తమ స్పందన తెలపాల్సిందిగా బిజెపి ఎంపి బన్సూరీ స్వరాజ్, ఇతర ప్రతివాదులకు గతేడాది అక్టోబర్‌లో కోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# అమెరికాలో మోడీ పాట్లు

ఫిబ్రవరి 13న వైట్‌హౌస్‌కు ప్రధాని మోడీ పర్యటన.. ఆయనకు తన మిత్రుడు డోనాల్డ్ ట్రంప్ ఎంత సన్నిహితమో ప్రదర్శించడానికీ, ఆ సందర్భంలో తీసుకున్న ఫోటోలను గొప్పగా చూపించుకోవడానికీ ఉద్దేశించింది. తీరా జరిగింది వేరే. వాషింగ్టన్‌కు మోడీ జరిపిన స్వల్ప కాల సందర్శన ఆయన హయాంలో భారతదేశ హెూదా ఎంత కిందకు దిగజారిపోయిందో ప్రస్ఫుటం చేసింది. వాస్తవానికి అధ్యక్షుడు ట్రంప్‌తో అధికార సమావేశం కోసం భారత ప్రధాని అంత ఆగమేఘాల మీద పరిగెత్తి వెళ్లవలసినంత హడావుడి ఏమీ లేదు. జనవరి 20న ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి మోడీకి ఆహ్వానం పొందడంలో విఫలమైన పరిస్థితి. కనుక శ్వేత సౌధంలో ట్రంప్ ఎలా కుదురుకుంటాడో, ఆయన విధానాలు ఏ విధంగా విచ్చుకుంటాయో చూడవలసింది. ఆ విధానాలలో అనేకం అంతర్జాతీయ సంబంధాలలో ప్రకంపనలకు కారణమవు తాయని భావిస్తున్నారు. అయితే మోడీ, బిజెపి స్వతస్సిద్ధ లక్షణాలు వేరు. తాము అమెరికాకు ఎంత సన్నిహితులమో చూపించుకోవడం వారికి కీలకం. భారత దేశం ప్రపంచ శక్తిగా తయారైందనే దానికి అది తిరుగులేని సూచిక అని వారి భావన. అందుకనే మోడీ ట్రంప్ అధ్యక్ష పదవి స్వీకరించిన నెలలోగానే కలుసుకున్న నాలుగో విదేశీ నేత అయ్యారు. అలా కలుసుకున్న మిగిలిన ముగ్గురూ ఇజ్రాయిల్, జపాన్, జోర్డాన్‌ల నేతలు ముగ్గురూ అమెరికాకు ఆప్త మిత్రులే.

భారత దేశంతో సహా అన్ని దేశాల మీద పోటా పోటీగా వాణిజ్య సుంకాలు విధించడం జరుగుతుందని ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటలలోనే మోడీ ఆయనతో శ్వేత సౌధంలో అధికారికంగా భేటీ అయ్యారు. ఏ దేశమైనా అమెరికా సరుకుల మీద ఎంత సుంకాలు విధిస్తుందో తాము కూడా అంతే సమానంగా విధిస్తామని ఈ ప్రకటనతో ట్రంప్ చెప్పేశాడు. ఈ సమావేశం తర్వాత మోడీతో జరిపిన సంయుక్త పత్రికా గోష్టిలో ట్రంప్ ఇండియా అత్యధిక సుంకాలు విధించే దేశంగా వుందని నొక్కి మరీ చెప్పారు. భారత అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల అంశాల్లో తన డిమాండ్లనూ సమస్యలనూ ముందుకు నెట్టడంలో ట్రంప్ కృతకృత్యుడైనాడని సమావేశం తర్వాత వెలువడిన సంయుక్త ప్రకటన స్పష్టం చేస్తున్నది. ఇరు దేశాల మధ్య వ్యాపారం 13,000 కోట్ల డాలర్లయితే అందులో అమెరికా లోటు 457 కోట్ల డాలర్లు వుంది. అమెరికా నుంచి ఇండియా చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకోవడానికీ, అమెరికా రక్షణ సామగ్రి మరింతగా కొనుగోలు చేసేందుకు ట్రంప్ ఒప్పించగలిగారు. రక్షణ వాణిజ్యం వేగవంతం చేయడం, రక్షణ పరికరాలు సేవల కొనుగోలు వ్యవస్థలను మరింత బాగా సమన్వయం చేసుకోవడం గురించి సంయుక్త ప్రకటన పేర్కొన్నది. ట్రంప్‌ను సంతోష పెట్టడం కోసం భారత దేశం అమెరికా నుంచి మరింత ఖరీదైన చమురు, సహజ వాయువు కొనుగోలు చేయవలసి వుంటుంది. దానివల్ల మన చమురు భారం పెరిగిపోతుంది. ఇప్పుడు మనం చేస్తున్నట్టే రష్యా చమురు, సహజ వాయువు కొనుక్కోవడం మరింత చౌకగా వుంటుంది. ఇరాన్ నుంచి మరింత నాణ్యమైన ముడి చమురు కొనుగోలు చేసే అవకాశం వున్నా అమెరికా హుకుంల వల్లనే ఇండియా దాన్ని కొనుక్కోవడం నిలుపు చేసింది.



ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం భారత దేశాన్ని రక్షణ పరికరాల కొనుగోలుకు సంబంధించిన పది సంవత్సరాల ఒప్పందంపై చర్చకు కట్టుబడి వుండేలా ఒప్పించింది. ఇది వ్యూహాత్మకంగానూ సైనికంగానూ భారత దేశాన్ని అమెరికాతో ముడివేస్తుంది. భారత దేశానికి ఎఫ్-35 గూఢచారి విమానాలు విక్రయిస్తామని అమెరికా సంసిద్ధత తెల్పడంపై మోడీ ప్రభుత్వం దిగులు పడాల్సిన విషయం. అవి భరించలేనంత ఖరీదైనవే గాక వాటి నిర్వహణ కోసం మొత్తం మన రక్షణ బడ్జెట్‌తో సాధ్యమయ్యేది కాదు. కానీ ఆ ప్రతిపాదనను నిరాకరించడం మోడీ వల్ల కుదిరేది కాదు. వందల కోట్ల డాలర్ల విలువైన అమ్మకాలు జరుగుతాయని ట్రంప్ సంయుక్త పత్రికా గోష్టిలో ప్రకటించారు. క్వాడ్ కూటమికీ, ఇండో పసిఫిక్ వ్యూహాలకూ ట్రంప్ ఇచ్చే ప్రాధాన్యత కొనసాగేలా చూడటమనేది మోడీ ప్రభుత్వ ఆందోళనల్లో ఒకటి. ఢిల్లీలో క్వాడ్ నాయకుల శిఖరాగ్ర సభకు అధ్యక్షుడు ట్రంప్‌కు ఆతిథ్యమివ్వాలనే అంశం సంయుక్త ప్రకటనలో ప్రస్తావించబడింది. ఇది మోడీ ఎంతగానో తాపత్రయ పడుతున్న ఆకాంక్ష. వాణిజ్య సంబంధాలను సమీక్షించి ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందంలో మొదటి విడతకు సంబంధించిన అవగాహనకు రావాలని అమెరికా, ఇండియాలు భావించాయి. కానీ ఇది భారత దేశానికి సంబంధించినంత వరకూ అటూ ఇటూ రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. ట్రంప్ పాలనా యంత్రాంగం పెట్టుబడులు, వాణిజ్యానికి సంబంధించిన అన్ని అంశాల లోతుల్లోకి వెళుతుంది. భారత దేశ డేటా పరిరక్షణ నిబంధనలు, సబ్సిడీలు, పన్నుల వ్యవస్థ, నియంత్రణా చర్యలు అన్నీ ఈ చర్చలోకి వస్తాయి. మామూలుగా ఇవి విదేశీ వ్యాపారుల కన్నా దేశీయ వ్యాపారానికి అనుకూలంగా వుంటాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ చుట్టూ రక్షణ కుడ్యం ఏర్పాటు చేసుకుని భారతీయ ఆర్థిక వ్యవస్థపై మాత్రం ఆమెరికా సరుకులను రుద్దడం ట్రంప్ ఉద్దేశంగా వుంటుంది.

అణు రియాక్టర్లను కొనుగోలు చేయాలని అమెరికా నుంచి వత్తిడి వస్తుందని ఊహించబట్టే మోడీ ప్రభుత్వం పౌర అణు విపత్తుల బాధ్యత చట్టం ఇప్పటికే ప్రకటించింది, భారత దేశానికి వెస్టింగ్‌హౌస్ తయారు చేసిన అరడజను అణు రియాక్టర్ల అమ్మకాన్ని వేగవంతం చేయాలంటున్నది సంయుక్త ప్రకటన. ఈ విషయంలోనూ మోడీ సర్కారు ఏవైనా ప్రమాదాలు జరిగితే అణు రియాక్టర్ల సరఫరా దారులపై భారం లేకుండా చేస్తున్నది. ఆ విధంగా భారతీయుల ప్రాణాలకూ భద్రతకూ ద్రోహం తలపెడుతున్నది.

అక్రమంగా ప్రవేశించిన భారతీయులను అమెరికా నుంచి పంపేయడంలో న్యాయమైన, మానవీయమైన పద్ధతులను అమలు పర్చేలా చేయడంలో విఫలత కూడా మోడీ పర్యటనలో కొట్టవస్తున్నట్టు కనిపించే లోపం. ఇలాంటి తొలి భారతీయుల బృందంలో వారికి సంకెళ్లు వేసి కాళ్లు కట్టేసి సైనిక విమానంలో వెనక్కు పంపేసినప్పుడు దేశంలో నిరసన పెల్లుబికింది. కానీ విదేశాంగ మంత్రి జైశంకర్ మాత్రం ఇది అమెరికా అధికారులు మామూలుగా అనుసరించే ప్రక్రియ ప్రకారమే జరిగిందని పార్లమెంటులో సిగ్గు లేకుండా మాట్లాడారు. మోడీ ఈ విషయాన్ని ట్రంప్ దగ్గర లేవనెత్తుతారని భావించబడింది. ఒకవేళ ఆయన ఆ పని చేశారా అనేది సందేహమే అయినా దాని ప్రభావం మాత్రం ఏమీ లేదు. మోడీ తిరిగి వచ్చాక అలా పంపేయబడిన వారు మరో రెండు విమానాలలో చేతులకు సంకెళ్లు, కాళ్లకు బంధనాలతోనే అమృత్‌సర్ చేరుకున్నారు. ఈ విషయంలో కొలంబియా, మెక్సికో దేశాల అధ్యక్షులు అనుసరించిన ఆత్మాభిమాన పూరితమైన ధృఢవైఖరికీ దీనికి పోలికే లేదు. చివరగా చెప్పాలంటే పచ్చి మితవాద విధానాలతో దుందుడుకు సామ్రాజ్యవాదంతో సాగుతున్న ట్రంప్ భావ తరంగాలకు మోడీ కూడా సమభావంతోనే వున్నారనేందుకు వాషింగ్టన్ పర్యటన ఒక సంకేతం. తాము గాజాను హస్తగతం చేసుకుని అక్కడున్న పాలస్తీనియన్లందరినీ తొలగించి అభివృద్ధి పర్చాలని చేసిన ప్రకటనపై భారత ప్రభుత్వం స్పందించలేదు. నెతన్యాహుతో జరిపిన ఉమ్మడి పత్రికా గోష్టిలో ట్రంప్ చేసిన ఈ ప్రకటన నెతన్యాహుకు మహానందం కలిగించింది. అందువల్ల ఇది అంతర్జాతీయ చట్టాలను ఘోరంగా ఉల్లంఘించడమే అవుతుందని మోడీ ట్రంప్ దగ్గర ఎలాంటి అనామోదం చెప్పే ప్రసక్తి వుండదు. ఎందుకంటే ఏది ఏమైనా ట్రంప్, నెతన్యాహు, మోడీ అందరూ భావజాల పరంగా ఒకే గూటి పక్షులుగా ఒకే జాతి ఈకలు కలిగిన వారే.

# పట్టభద్రుల్లో మైనారిటీ ఓట్లే కీలకమా?

ప్రస్తుతం జరుగబోతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నమోదు కోసం చివరి వరకు ఇచ్చిన అవకాశంలో మొత్తం 3 లక్షల 80 వేల పైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఇందులో దాదాపు 50 నుండి 60 వేల వరకు మైనారిటీ ఓట్లు ఉన్నాయని ఓటరు లిస్టులు చెబుతున్నాయి. త్వరలో జరగబోయే ఎన్నికలలో వీరు కీలకం కాబోతున్నారని కొన్ని సర్వే లెక్కల ద్వారా తెలుస్తుంది. ఈ మధ్య మైనారిటీ వర్గ విద్యావంతుల టిం కరీంనగర్ ఎంఎల్‌సి నియోజకవర్గంలోకి వచ్చే అన్ని జిల్లాలలోని యువత, అధ్యాపకుల శాంపిల్ సర్వే, మైనారిటీ వర్గ పెద్దలు, విద్యార్థులు అభిప్రాయాల ద్వారా జరిపిన కొన్ని విశ్లేషనల్లో తేలిన విషయం వలన చివరికి మైనారిటీ ఓట్లు గెలుపోటములను తారుమారు చేయబోతున్నారు. ఈ నియోజక వర్గ పరిధిలో మొత్తం నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 13 నూతన జిల్లాలున్నాయి. ఇందులో ముస్లిం ప్రాబల్యం ఉన్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, బైంసా, బోధన్, జగిత్యాల, కోరుట్ల లాంటి పట్టణాల్లోని యువత ప్రభావం చూపనుంది. ప్రస్తుతం పట్టభద్రుల ఎంఎల్‌సి కోసం పోటీపడుతున్నది మొత్తం 56 మంది. అయితే ఇందులో నలుగురే చివరి వరకు పోటీలో ఉండవచ్చు. అయితే ముస్లిం వర్గం సెక్యులర్ పార్టీలకు, సెక్యులర్ వ్యక్తులకే మద్దతిస్తాయి. కాబట్టి ప్రతిసారి దాదాపు కాంగ్రెస్ పార్టీకు, బిఆర్‌ఎస్ పార్టీకే మద్దతుగా నిలిచాయి. ఈసారి వీరు ఏవరికి మద్దతిస్తారనేది సాధారణ జనాలకు అంతుపట్టడం లేదు. పోటీలో ఉన్న ముఖ్యనాయకులు సైతం వీరి నాడీపట్టలేకపోతున్నారు. కొందరు తమకే అనుకూలంగా ఉంటారని భావిస్తున్నప్పటికీ చివరికి వారి అంచనాలు తారు మారయ్యే సందర్భాలున్నాయి. వాటిని ఒకసారి పరిశీలించినట్లయితే ఈసారి బిఆర్‌ఎస్ పార్టీ తరపున అభ్యర్థిని ప్రకటించక పోవడంతో కాంగ్రెస్‌కు మద్దతుగా ఉంటారని అనుకుంటే అది ఈసారికి మాత్రం అనుమానంగానే ఉంది. దీనికి కారణం కొన్ని అంశాలు ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా ముస్లిం వర్గం నుండే స్వతంత్ర అభ్యర్థి పోటీలో ఉండి సాధ్యమైనంత వరకు ఓట్లకోసం ప్రయత్నం నడుస్తుంది. గెలవకున్నా సరే ఓట్లు మాత్రం తప్పకుండా చీలిపోతాయి. దీనితో పాటు బిఆర్‌ఎస్ పార్టీ మాజీ మేయర్ రవీందర్ సింగ్‌కి కూడా మైనారిటీ ఓట్లు పడనున్నాయి. తాను చేసిన సేవా కార్యక్రమాల వలన కొందరు ప్రజలు, బిఆర్‌ఎస్ పార్టీలోని మైనారిటీ వర్గం ఈయనకు అనుకూలంగా ఉంది. ఇలా మైనారిటీ ఓట్లు చీలుతుండడంతో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి కొంతమేరకు నష్టమే జరుగుతుంది. మరొక విషయమేమంటే కాంగ్రెస్ పార్టీ పెద్దలు, మంత్రులు చొరవ తీసుకొని మైనారిటీ నాయకులతో ఎన్నో సభలు నిర్వహిస్తున్నప్పటికీ అసలు గ్రాడ్యుయేట్ ఓటర్లు, విద్యావంతులు కాకుండా పార్టీ కార్యకర్తలతో సభలు నిర్వహిస్తున్నామనే విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్ అభ్యర్థికి ముందునుండి మైనారిటి వర్గ నాయకులతో పెద్దగా పరిచయాలు లేకపోవడంతో అనుకున్నంత శాతం ఓట్లు రాకపోవచ్చని అంచనా! ఈ కారణాలతో 30 నుండి 40 వేల ఓట్ల ప్రభావంతో గెలుపోటమి తారుమారు కావచ్చు! ఆదే సందర్భంలో ఆల్ ఇండియా పార్టీ తరపున పోటిలో ఉన్న బిఆర్‌ఎస్ నాయకుడు రవీందర్ సింగ్‌కు మైనారిటీ ఓట్లు అధిక శాతం వచ్చినట్లైతే సింగ్ గెలిచే అవకాశాలు కూడా పెరిగిపోతాయి. దీనికి తోడు రవీందర్ సింగ్ మరో వర్గం ఓట్ల కోసం మరికొంత కష్టపడాల్సి ఉంటది. ఇలా వీరిద్దరికి కాకుండా మైనారిటీ ఓట్లు స్వతంత్రంగా నిలబడ్డ ముస్లిం అభ్యర్థికి పడతాయని చాలా మంది నమ్ముతున్నప్పటికీ వాస్తవంగా తేలిన విషయమేమంటే ఈయనకి కూడా మొత్తం ఓట్లు పడవు. గెలిచే అవకాశం లేదని, ఓటు వృథా చేయవద్దని కొందరు ముఖ్య మైనారిటీ నాయకుల హితబోధతో ముస్లిం అభ్యర్థికి మొత్తం ఓట్లు రాలేని పరిస్థితి నెలకొంది. ఓట్లు వేసేది విద్యావంతులు, పట్టభద్రులు కావున చాలా తెలివిగా ఆలోచించి గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థి వైపే చివరకు మొగ్గు చూపుతారని తెలుస్తుంది. బిసి అభ్యర్థుల తరపున ముగ్గురు నలుగురు బలమైన అభ్యర్థులు పోటీలో ఉండడం వలన బిసి వర్గం ఓట్లు ఖచ్చితంగా ఒకే అభ్యర్థికి రావడం కష్టమే! ఇందులో ఒక అభ్యర్థి బహుజన సమాజ్ పార్టీ తరపున గట్టి ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఈ వర్గ అభ్యర్థులు మైనారిటీ ఓట్ల మీద ధ్యాస పెట్టలేకపోతున్నారు. ఇలా ప్రధాన పోటీదారులు ప్రణాళిక లేకుండ, ఓట్లను పొందలేక గెలిచే అవకాశం ఉన్నవారు కూడా ఓటమి చవిచూడవచ్చు! దాదాపు 50 వేల పైన అధిక సంఖ్యలో ఉన్న మైనారిటీ ఓట్లు ఒకే అభ్యర్థికి వచ్చినట్లైతే వంద శాతం విజయాన్ని ముద్దాడవచ్చు. ఈ లెక్కను పసిగట్టలేని సదరు అభ్యర్థులు మైనారిటీ ఓట్లను రాబట్టడంలో ఇప్పటి వరకైతే సఫలం కాలేదనే చెప్పాలి. అందరూ పైపైనే ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి లేదా మాజీ మేయర్ సింగ్ గట్టి ప్రయత్నం చేస్తే అధిక శాతం మైనారిటీలు ఒకే వైపు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ వీరెవరూ ఆ ప్రయత్నాలు చేయడం లేదు. ప్రభుత్వాన్ని పాలిస్తుంది కాంగ్రెస్ పార్టీయే కాబట్టి వీరి ఓట్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఎక్కువగా ఉన్నప్పటికీ మాజీ మేయర్ రవీందర్ సింగ్‌కి కూడా కాంగ్రెస్ అభ్యర్థి నూతనంగా రాజకీయాల్లో అడుగుపెడుతున్నారు. కావున ఈ విషయంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. మైనారిటీ శాఖ మంత్రి లేకపోవడం కూడా కొంతమేరకు కారణం కావచ్చు. మరొక విచిత్రమేమంటే చాలా చోట్ల సభలలో పార్టీలకు సంబంధించిన మైనారిటీ కార్యకర్తలు తరలివస్తుంటే ఎవరికి వారు పక్కా గెలుస్తామని ధీమాలో ఉన్నారు. కాని నిజమైన పట్టభద్రులు ఆ సభలలో లేరనేది గుర్తించలేకపోతున్నారు. మైనారిటీ వర్గంలోని విద్యావంతులతో, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ముఖ్య నాయకులను ఒప్పించే ప్రయత్నం చేయగలిగితే ప్రధాన పోటీదారులకు ఫలితం ఉంటుంది.

# ఇసుక తవ్వకాలు ఇంకెంతకాలం ?

మొదటి పేజీ తరువాయి

రకమైన ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపినప్పటికీ ఇటు పోలీసు అధికారులు అటు ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమ ఇసుక రవాణా దారులకు సక్రమంగా సహకరిస్తూ ప్రభుత్వాన్ని పోలీస్ కమిషనర్ ను మోసం చేస్తున్నరన్నారు. రాష్ట్ర మైనింగ్ కమిషనర్ దామెర మండలంలోని గిద్దకుంట ప్రాంతంలో ఇసుక తవ్వకాల గుంతలను పరీక్షించి తవ్వకాలకు పాల్పడుతున్న 200 చైన్ మిషన్ యజమాని ఓర్సు పరుశురాం, జెసిబిల యజమానులు పెంట. చరణ్,దామెరుప్పల నాగరాజు,విక్కీ లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఏనుమాముల మార్కెట్ కు చెందిన టిప్పర్ బండ్లను వాడుకుంటూ ఇసుక వ్యాపారం చేస్తున్నారన్నారు. 200 చైన్ మిషన్ మూడు జెసిబి లతో 30 టిప్పర్లను వ్యాపారానికి వాడుకుంటూ రోజంతా బాయిల తవ్వకాలను చేస్తున్నామంటూ గ్రామస్తులను నమ్మిస్తూ రాత్రంతా అక్రమంగా తవ్వకాలు పాల్పడుతూ గుంతలు తీస్తూ ఒక్క జెసిబి ద్వారా 30 ట్రిప్పుల టిప్పర్ లను ఇసుక రవాణా వ్యాపారానికి పాల్పడుతున్నారన్నారు. 200 చైన్ మిషన్ నల్గొండకు చెందిన ఓర్సు పరశురాములుది గా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మూడు జెసిబిలలో ఒకటి పెంట చరణ్ అలియాస్ రాజుదిగా రెండవది దామెరుప్పల నాగరాజు అనే అతనిదిగా మూడవది విక్కి అనే వ్యక్తిదిగా వాడకంలో కొనసాగిస్తున్నట్లు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ వ్యాపారానికి ప్రధానంగా మూడు కార్లను వాడుతూ ఒక కారును దామెర స్మశాన వాటిక ప్రాంతంలో వెనుక భాగాన పరిశీలన కొరకు కాపలాగా పెట్టుకొనగా రెండవదిగా ఆరెపల్లి కెనాల్ బైరాన్ పల్లి గ్రామం మధ్యలో అబ్జర్వేషన్ కొరకు పెట్టుకున్నారన్నారు. మూడవదిగా గ్రామంలో ఎంట్రెన్స్ వద్ద నిలుపుకొని వచ్చి పోయే వాళ్లను పరిశీలిస్తూ అనుమానితులైన వ్యక్తులను జాగ్రత్తగా పసిగడుతూ అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డు తగలకుండా పలు జాగ్రత్తలు వహిస్తూ బీభత్సమైన ఇసుకతవ్వకాలకు పాల్పడుతున్నారన్నారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఇసుక తవ్వకాల అక్రమార్కులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ల యంత్రంగానికి ఫుల్ పవర్ కేటాయిస్తూ ఆదేశించినప్పటికీ స్థానిక పోలీస్ అధికారులే దగ్గరుండి వ్యాపారాలు చేస్తుండటం పట్ల డబ్బులకు అమ్ముడుపోయారని స్థానికులు వాపోతున్నారన్నారు. ఒకవైపు కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝ్హా ఇసుక తవ్వకాల ప్రాంతాలను విస్తృతంగా పర్యటిస్తూ అక్రమ ఇసుక మాఫియా దారులను పసిగట్టి చర్యలకు ఆదేశిస్తుంటే కిందిస్థాయి పోలీస్ అధికారులు డబ్బులకు అమ్ముడుపోయి దగ్గరుండి ఇసుక వ్యాపారం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇసుక మాఫియాను అరికట్టాల్సిన అధికారులే స్థానికులపై విరుచుకుపడుతూ బెదిరింపులకు దిగడం సిగ్గుమాలిన చర్యగా భావించాలన్నారు. ప్రభుత్వం అంటే భయం లేని కారణంగానే అధికారులు అంతా ఏకమై పైసలకు అమ్ముడుపోతున్నారని ఇసుకతవ్వకాల అక్రమ రవాణా స్పష్టం చేస్తుందన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై రాష్ట్రమంతా అన్ని పత్రికల్లో మీడియాలో విలువైన కథనాలను ప్రచురిస్తుంటే ఇసుక వ్యాపారస్తులు వాళ్లకేం పట్టనట్టుగా అధికారుల అండతో రెచిపోవడాన్ని ఏమనుకోవాలన్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులే బినామీ వ్యాపారం చేస్తున్నట్లుగా ఇసుకతవ్వకాలను కొనసాగిస్తుంటే సమాజాన్ని, ప్రభుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరిదన్నారు. ఇసుక తవ్వకాలకు అడ్డొచ్చిన వాళ్లను పోలీసు అధికారులచే బెదిరింపుల గురిచేస్తూ ప్రతిరోజు సుమారుగా 90 టిప్పర్ల రవాణాను కొనసాగిస్తూ వ్యాపారం చేయడంతో పాటు 200 చైన్ మిషన్ సహకారంతో మరిన్ని టిప్పర్లను తవ్వకాలలో వాడుకుంటున్నారన్నారు. అందరికీ తెలిసి ఇసుక వ్యాపారం జరుగుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడం పలు క్షేత్రస్థాయి అనుమానాలకు దారితీస్తుందన్నారు. పోలీస్ కమిషనర్ ఇసుక తవ్వకాల సంఘటన స్థలాన్ని నేరుగా పరిశీలించి గుంతల తవ్వకాలను పసిగట్టి ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటే తప్ప పోలీస్ రెవెన్యూ మైనింగ్ ఇరిగేషన్ అధికారులు కదిలేట్టు లేరన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన ప్రణాళికలకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. దామెర మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల గుంతలను పోలీస్ కమిషనర్ సీరియస్ గా పరిగణలోకి తీసుకోవాలన్నారు. అందరూ ఏకమై మైనింగ్ దందాకు పాల్పడుతుంటే కాపాడాల్సిన అధికారులు ఎవరంటూ సూటిగా ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి టిప్పర్లను సీజ్ చేయడంతో పాటు చైన్ మిషన్ ను అందుబాటులోకి తీసుకొని సాంకేతిక ఆధారాలతో వివరాలను సేకరించి అక్రమ ఇసుక తవ్వకాలకు కారకులైన వ్యక్తులపై రాష్ట్ర మొత్తం అక్రమ ఇసుక రవాణా నిర్మూలించబడే విధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ను కోరినారు. దానితోపాటు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఇట్టి అక్రమ ఇసుక తవ్వకాలపై ఉన్నతాధికారులను ఆదేశించి కఠినమైన చర్యలు తీసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. తవ్వకాలకు సహకరిస్తున్న ప్రభుత్వ అధికారులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## మహిళలకు ఆర్థికసాయంపై మాటతప్పిన బిజెపి

### సిఎం రేఖాగుప్తా ఆఫీసు ముందు అతిషి ధర్నా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి24((జై భీమ్ న్యూస్)):**

మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయంపై బీజేపీ ప్రభుత్వం మొదట్లోనే మాటతప్పిందంటూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, విపక్షనేత అతిషి ఆరోపించారు. ఆప్ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేఖాగుప్తా కార్యాలయం ఎదుట సోమవారంనాడు నిరసనకు దిగారు. రెండ్రోజులుగా సమయం ఇవ్వాలని సీఎంని అడిగాం. ఇవ్వలేదు. ఈరోజు అసెంబ్లీ సమావేశాల సమయంలో సీఎంను కలుస్తాం. మోదీ ఇచ్చిన హామీని క్యాబినెట్ తొలిసమావేశాల్లోనే అమలు చేయాలని సీఎంను కోరాం. వాళు వాగ్దాన భంగం చేశారు. మార్చి 8వ తేదీ నుంచి మహిళా సమ్మాన్ యోజన కింద రూ.2,500 తప్పనిసరిగా ఢిల్లీ మహిళలకు చేరాలని ఆశిస్తున్నాం అని అతిషి చెప్పారు. ఖాళీ ఖజానాను తమకు అప్పగించారంటూ సీఎం రేఖా గుప్తా చెప్పడంపై అతిషి మాట్లాడుతూ, పదేళ్ల తర్వాత ఆర్థికంగా బలంగా ఉన్న ప్రభుత్వాన్ని బీజేపీకి తాము అప్పగించామన్నారు. సాకుల కోసం వెతుక్కోకుండా ఇచ్చిన వాగ్దానాలను బీజేపీ నిలబెట్టుకోవాలని సూచించారు. 2015లో ఆప్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఢిల్లీ మొత్తం బడ్జెట్ రూ.30,000 కోట్లు మాత్రమేనని, గత పదేళ్లలో బ్జడెట్ రూ.70,000 కోట్లకు పెరిగిందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను ఏదోసాకుతో ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తారని బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తాను అనుకుంటూనే ఉన్నానని అన్నారు. కాగా, దీనికి ముందు రేఖాగుప్తా మీడియాతో మాట్లాడుతూ, ఆప్ ప్రభుత్వం వెళ్తూ వెళ్తూ ఖజానాను ఖాళీ చేసి వెళ్లిందని, దీనిపై అధికారులతో సమీక్ష జరిపామని చెప్పారు. సమగ్రమైన ప్రణాళికలతో మహిళా సమృద్ధి యోజన పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు.

# "రాజకీయ ఖైదీ" అంటే ఎవరు?

### కులము,మతమే కీలకమని అంటున్న రోనావిల్సన్

### ఆరున్నర సంవత్సరాలపాటు జైలులో గడిపిన ఎల్గార్ పరిషత్ కేసు నిందితుడు మనదేశంలోని కారాగారాలు "అత్యవసర స్థితి"లో ఉన్నాయని కూడా చెబుతున్నాడు.



**ముంబై(జై భీమ్ న్యూస్)**

రోనావిల్సన్ చాలా కాలం నుండి ఖైదీల హక్కుల కోసం పని చేస్తున్న న్యాయవాది. అంతేకాకుండా రాజకీయ ఖైదీ అన్న పదానికి విశ్వసనీయమైన ప్రచారకుడు కూడా. అయినాకూడా, ఎల్గార్ పరిషత్ కేసుకు సంబంధించిన సుదీర్ఘ జైలు జీవిత సమయంలో తనలో ఒక నైతిక సందిగ్ధతకు సంబంధించిన పెనుగులాట జరగడాన్ని ఆయన గమనించాడు. మహారాష్ట్రలో పూనేలోని ఎరవాడ, నవీ ముంబైలోని తలోజా కేంద్రకారాగారాలలో ఆయన ఆరున్నరేండ్ల జైలు జీవితాన్ని గడిపాడు. జైలు జీవితంలో తన కార్యాచరణతో జైలు పరిధిలోనే తను చేసిన పరిశోధన వల్ల సరికొత్తగా- దగ్గర నుండి చూసిన అనుభవాలతో 53 ఏండ్ల రోనా ఇప్పుడు "రాజకీయ ఖైదీ" అనే పదాన్ని విభిన్నమైన దృక్పథంతో చూస్తున్నాడు. ఇప్పుడు ఈ విషయాన్ని ఎరుకతో కులము, మతము అనే ప్రమాణాలనుండీ పరిశీలిస్తున్నాడు. భారతదేశ నేపథ్యంలో మరీ ముఖ్యంగా ప్రధానస్రవంతి సంభాషణల్లో "రాజకీయ ఖైదీ" అనే మాట వామపక్ష కార్యకర్తలతో ముడిపడి ఉంది. ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టయిన తొలి 16మంది మానవ హక్కుల కార్యకర్తలలో ఒకరైన రోనా ఇది సరైన అవగాహన కాదని వాదిస్తున్నాడు. వలసవాద వ్యతిరేక పోరాటంలో నెహ్రూ, గాంధీలను కూడా రాజకీయ ఖైదీలుగా గుర్తించిన విషయాన్ని ఆయన గుర్తుకు తెస్తున్నాడు. ఈ పదానికున్న చరిత్రను వెలికితీస్తూ బహుశా ఐరిష్ జాతీయవాదులే మొదటగా తమకు రాజకీయఖైదీ హోదా కల్పించమని డిమాండ్ చేసిన వారని ఆయన నమ్ముతున్నాడు. జైలులో గణనీయమైన కాలాన్నే తాను గడిపినందువల్ల ఈ అవగాహనని మరింతగా విస్తృతపరిచేందుకు ఆయన ఇటీవల ప్రయత్నిస్తున్నాడు. "రాజకీయఖైదీ" అంటే ఎవరూ అనే దాని చుట్టూ జరుగుతున్న వాదనలో "కనపడకుండా పోయిన చారిత్రక, సామాజిక నేపథ్యాల"ను, భారతీయ సమాజం వలస పూర్వ, వలసానంతర కాలాల్లో, కేవలం పుట్టుకను ఆధారంగా చేసుకొని సృష్టించిన ఒక ప్రత్యేకమైన "నేర వర్గీకరణ"ను ఆయన గుర్తిస్తున్నాడు. సామాజిక పిరమిడ్ ను భగ్నం చేసేవాళ్లను ఈ తిరోగమన సమాజం శిక్షిస్తుంది. దీనికిగాను జైలులో తన సహచరుడు మహేశ్ రౌత్ చేసిన పరిశోధనను ఆయన ఉపయోగించుకున్నాడు. మహేశ్ గడ్చిరోలికి చెందిన ఆదివాసీ హక్కుల కార్యకర్త. ఇంతకుమునుపు ఉనికిలో ఉన్న ప్రధాన మంత్రి గ్రామీణ అభివృద్ధి పరిశోధకుడు. జైలును ఆయన తన పరిశోధనశాలగా మార్చుకున్నాడు. ఆయన చాలా ఏండ్ల పాటు తలోజా జైలులో ఉండి, ద ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రెన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ కు లోబడి అరెస్టయిన వ్యక్తుల వివరాలను సేకరించాడు. ఈ చట్టాన్ని 2012లో పిల్లలపై లైంగిక వేధింపులు, దోపిడీ, బాధించడానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టారు. రౌత్ పరిశోధన వల్ల ఈ చట్టం కింద నిర్బంధానికి గురయినవాళ్ళు 80 శాతం మంది దళితులు, ముస్లీంలు, ఇతర నిమ్నవర్గాల ప్రజలుగా తేలింది. "వీరిలో కొందరు వాస్తవంగానే నేరపూరిత చర్యలకు పాల్పడి ఉండవచ్చు కానీ చాలామంది కేవలం సామాజిక పిరమిడ్ ను భగ్నం చేయడం వల్లనే నేరస్తులుగా చూపించారు" ఆయన అన్నాడు. "ఈకులు తెలిసో తెలియకనో ఇతర కుల స్త్రీలతో ప్రేమ వ్యవహారాలు, వ్యాపార సంబంధాలు ఏర్పరుచుకోవడం ద్వారా సామాజిక చలనాన్ని ఆశించారు. ఇది సామాజిక కట్టుబాట్లను ధిక్కరించడంగా భావించబడింది. ఈ అతిక్రమాన్ని ఈ తిరోగమన సమాజం శిక్షిస్తుంది. ఫలితంగా వారి చర్యలు వారిని జైలుపాలు చేశాయి" అని రోనా వివరించారు. మరీ ముఖ్యంగా కుల కట్టుబాట్లతో, తీవ్రమైన మతతత్వంతో విడిపోయి ఉన్న భారత సమాజంలో ఇలాంటి అతిక్రమని రాజకీయచర్యగా అర్థం చేసుకునేందుకు రోనా ప్రయత్నం చేస్తున్నాడు. ఆదివాసులు తమ భూమి హక్కు కోసం చేసే పోరాటాలను ప్రస్తావిస్తూ ఆదివాసీలు వారి నేల కోసం పోరాడుతున్నారు. ఒక ప్రత్యేకమైన భూభాగంలో పుట్టడంవల్ల రాజకీయ ఖైదీలవుతారని ఆయన అన్నారు. రాజ్యం, భూమి నుండి సంపద్వంతమయిన ఖనిజాలను సొంతం చేసుకోజూసే కార్పోరేట్ల నుండి తమ భూమిని కాపాడుకోవడానికి వారు పోరాటం చేయవలసి ఉంటుంది. గుర్తుచేస్తున్నాడు. "కాలం గడిచేకొద్దీ అనేక సమూహాల సహజమైన జీవితము, సంచార జీవిత సమూహాలతో సహా నేరపూరితమవుతుంది" అని చెబుతూ వలస కాలంలో అమలు చేయబడిన బ్రిటీష్ వ్యాగ్రన్సీ యాక్ట్, ఇంకా దానిని పోలిన ఇతర చట్టాలను ఆయన ప్రస్తావించాడు. "వీటన్నిటినీ లోతుగా అధ్యయనం చేయడనికి వలస కాలంలో రాజ్యం అవలంబించిన లీగల్ ఆర్కిటెక్చర్ గురించి అవగాహన ఉండాలి. డీకోలనైజేషన్ గురించి అందరూ మాట్లాడుతున్నప్పటికీ అదే రకమైన లీగల్ ఆర్కిటెక్చర్ ను ప్రస్తుత రాజ్యం కూడా అనుసరిస్తూంది" అని ఆయన అన్నాడు. భారతీయ న్యాయ వ్యవస్థ నిర్బంధానికి గురైన ఏ వ్యక్తినీ "రాజకీయ ఖైదీ"గా గుర్తించలేదు. ఒక దశాబ్దం క్రితం దాకా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాజకీయఖైదీని ప్రత్యేక తరగతిగా గుర్తించి, పుస్తకాలు, ఆహారం, జైలు లోపల చోటూ కల్పించడం వంటి విషయాల్లో కొన్ని వసతులు కల్పించారు. కానీ 2013లో స్టేట్ జైల్ మాన్యువల్ నుండి ఈ తరగతి విభజనని తొలగించారు. ఎల్గార్ పరిషత్ రాజకీయ కార్యాచరణని రాజ్యము తన ఆధిపత్యానికి అవమానంగా భావిస్తుంది. కారాగారంలో రాజకీయఖైదీల రాజకీయ వైఖరులకు చాలా తక్కువ ప్రాధాన్యత ఉంటుందని రోనా అంటాడు. పరిషత్ కేసులో తను గానీ, ఇతర ఉద్యమకారులుకానీ రాజకీయ కార్యాచరణకు దిగితే రాజ్యం దానిని తన "ఆధిపత్యానికి అవమానం"గా భావిస్తుంది. నిందితులను విరోధులుగా చూస్తున్నదని ఆయన అంటాడు. 2020ఫిబ్రవరిలో వేగంగా వ్యాపిస్తున్న కొవిడ్ పై పోరాడేందుకు బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్ డౌన్ విధించింది. దీనికి కొన్ని వారాల ముందు పరిషత్ నిందితులను ఎరవాడ జైలు నుండి నవీముంబైలోని తలోజా జైలుకు తరలించారు. ఇక్కడ వారం వారం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసుకునే సదుపాయాన్ని జైలు అధికారులు ఆపి వేశారు. అనేక విజ్ఞప్తుల తర్వాత, తమ కుటుంబ సభ్యులు ప్రెస్ తో మాట్లాడితే తిరిగి ఫోన్ సదుపాయం కలిగిస్తామని వారు అన్నారు. "నేను నా కుటుంబ సభ్యులను ఎలా ఆహ్వానిస్తున్నాను" అని రోనా అంటాడు. సంవత్సరాలు గడిచేకొద్దీ హక్కుల కార్యకర్తలపై జైలు అధికారులు కొంత మెత్తబడ్డాడు. కొన్ని సౌకర్యాలను కూడా అందించారు. కానీ అవి తమ నిరసనలను తెలపకుండా ఉన్నంత వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఎల్గార్ పరిషత్ కేసు ఉద్యమకారులు ఒకసారి నిరసనలకు దిగితే దాని ప్రభావం జైలులో వెల్లువలా ఉండేది. జైలులో ఉండే ఇతర ఖైదీలూ గొంతెత్తేవారు. ఇది జైలు అధికారులకు ఎంతమాత్రమూ నచ్చదు. జైలులో పరిషత్ నిందితులను తెలపడం ద్వారా మహారాష్ట్ర జైలు మాన్యువల్ ప్రకారం రోజుకు 13 లీటర్ల నీరు, అంటే 9 బకెట్లు మొత్తంగా పొందగలిగేలా చేయగలిగారు. "జైలులో వివక్ష తీవ్రంగా ఉంటుంది. మాకు రావలసిన నీళ్ళ కోటాను మేము పొందుతుంటే, ఇతరులు మాత్రమూ ఒకటి లేదా అర బకెట్ నీళ్ళతోనే సరిపుచ్చుకోవాల్సి ఉండేది. ఆ కొద్ది మొత్తం నీళ్ళతో జైలులో ఉండడం అంటే అక్కడి జీవన పరిస్థితులు ప్రతీ ఒక్కరి గడపకీ దుర్భరంగా మారడమే" అని ఆయన అంటారు. ఒక్కో బ్యారక్ లో ఉండే నాలుగు మరుగుదొడ్లలో రెండు మాత్రమే పని చేస్తుంది. ఇది జైలులో అలిఖిత నియమంగా ఉంటుంది. జైలు బ్యారక్ కు దగ్గరగా ఉండే మరుగు దొడ్డిని వాడకుండా వదిలేస్తారు. ఈ జాగ్రత్త తీసుకుంటేనే అక్కడ నుండి వచ్చే దుర్వాసన బ్యారక్ కు చేరకుండా ఉంటుంది. గొంతు ఆ తర్వాత జైలులో గడపడం వల్ల రోనా భారత దేశంలో ఉన్న జైళ్ళ గురించి ఒక్క మాట అంటారు. "కరోనా వంటి అంటువ్యాధులతో సంబంధం లేకుండానే మన జైళ్ళు అత్యవసర పరిస్థితుల్లో ఉన్నాయి." శారీరక దండన ద్వారా జోక్యం చేసుకోవడం అనే దానిని అనుసరించి ఇవి పని చేస్తాయి. కాబట్టే ఖైదీలు తమకు వ్యతిరేకంగా ఉన్న విధానాలకు వ్యతిరేకంగా తమను తాము సమీకరించుకుంటారు. కానీ వీరిని జైలు అధికారులు లొంగదీసుకుంటారు. "ఈ బంధీలు ఆందోళన జీవులు( ప్రధాన మంత్రి మాటల్లో) ఎంతమాత్రమూ కాదు. వీరు ఎన్నడు సంఘాలలో కలిసి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన వాళ్ళు కాదు. వీళ్ళు సాధారణ మనుషులు." వాళ్ళు ఒక్కటిగా జమకూడినపుడు వ్యవస్థ ఒకసారిగా నిద్దుర లేస్తుంది. వాళ్ళ వీపులను పగలగొట్టడం, ప్రోత్సాహకాలను నిలిపివేయడం, ఒకరికి మరొకరికి వ్యతిరేకంగా ఉసిగొల్పడం జరుగుతుంది. చివరకు జైలు అధికారులు "ఇదంతా బాగుచేయలేని ఆ16మంది పనని మమ్మల్ని నిందిస్తారు." అని ఆయన అంటాడు. జైలులో చేసే కొన్ని నిరసనలు వ్యక్తిగత ప్రయోజనాలకు, అందరి బాగుకు దారి చూపుతాయి. కిందటి ఏడాది మధ్యలో రోనా, అతని సహచరుడు ప్రొఫెసర్ హనీ బాబు, జైలు క్యాంటిన్లో తడి పొడి వస్తువుల ఆకస్మిక ధరల పెరుగుదలకూ, అవినీతికీ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముందున్నారు. మొదట కొంతమంది ఈ ఉద్యమకారులకు మద్దతుగా వచ్చారు. కానీ జైలు అధికారుల ఒత్తిడితో వారు వెనక్కి తగ్గారు. చివరకు నిరసన ఫలితంగా ఎల్గార్ పరిషత్ నిందితుల కోరికలను అంగీకరించారు. కానీ ఈ ఫలితాల మిగిలిన ఖైదీలు మినహాయించబడలేదు. "ఒక మాంసం కిలో బదులు 400గ్రాములు అనే లెక్కతో సరైన పరిమాణంలో మాకు ఆహారం అందింది. కానీ ఇతరులకు మాత్రం పాత లెక్కలే ఉన్నాయి. కొన్ని పోరాటాలు వ్యక్తిగత ప్రయోజనాలను కలిగిస్తే అందరికీ తోడ్పడతాయని ఇక్కడ సంవత్సరాలు గడిచేకొద్దీ నాకు అర్థం అయింది" అని రోనా తెలియజేశారు. ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టయిన అందరి మాదిరిగానే రోనాకూడా మహారాష్ట్రలోని తలోజా జైలులోనూ, ఇతర జైళ్ళలోనూ కోర్టు ముందు హాజరు పరిచే పద్ధతి విఫలమవడంతో- దానికి వ్యతిరేకంగా పోరాడాడు. జైలులో తాను బంధీగా ఉన్నంత కాలమూ కోర్టుకు తీసుకపోవడానికి గానీ, ఆసుపత్రికి తీసుకపోవడానికి గానీ తగినంత ఎస్కార్ట్ ఉన్నట్టుగా తనకు గుర్తు లేదని ఆయన అన్నాడు. ఈ విషయంలో వారు నిరసనలు తెలుపుతూ వచ్చారు. కానీ కిందటి నెలలో నవీ ముంబైలోని కోల్డ్ ప్లే ప్రదర్శన సందర్భంగా సిబ్బంది అక్కడ విధులను నిర్వహించాలనే పేరుతో మొత్తంగా జైలులోని ఏ ఒక్క ఖైదీనీ బయటకు తీసుకపోలేమని అన్నప్పుడు మాత్రం వీరు చేసిన నిరసన విజయవంతమయింది. "ఈ విషయంలో మేము ఊరుకోమన్న సంగతి జైలుఅధికారులకు తెలుసు. ఇతర ఖైదీలలోనూ నిరసన స్పష్టంగా కనపడుతున్నది. అప్పుడు మేము చేసిన నిరసన సానుకూల ఫలితాలనిచ్చింది. అప్పటినుండీ చాలా మంది బంధీలకు వారివారి తేదీల ప్రకారం కోర్టులకూ, ఆసుపత్రులకూ ఎస్కార్ట్ తో పోవడానికి అనుమతి దొరికింది" అని అన్నారు. రోనా సహ నిందితుడు, సీనియర్ న్యాయవాది సునీల్ గాడ్లింగ్, సాంస్కృతిక కార్యకర్త సాగర గోర్కే ఇదే విషయంలో బాంబే హైకోర్ట్ లో పిటీషన్ కూడా వేశారు. రోనా చదువును కొనసాగించాలనుకుంటున్నాడు. కానీ తల్లి ఆరోగ్యం పట్ల ఆందోళన చెందుతున్నాడు. రోనా కేరళ వాసి అయినప్పటికీ, తన వయోజన జీవితమంతా విద్యార్థిగానూ ఆ తర్వాత హక్కుల కార్యకర్తగానూ దాదాపుగా ఢిల్లీలోనే గడిపాడు. 2003లో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ అబ్దుల్ రహమాన్ జిలానీ పార్లమెంట్ పై దాడి కేసులో అరెస్టయి దీర్ఘకాలపు జైలు జీవితాన్ని గడిపి, చివరకు తనపై మోపిన ఆరోపణలు నిరాధారమని తేలడంతో విడుదలయ్యాడు. జిలానీ విడుదలయిన తర్వాత రోనాతో కలిసి "కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్" ను ఏర్పరచాడు. ప్రొఫెసర్ సాయిబాబా విడుదలకు ఈ కమిటీ పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహించింది. 2018లో రోనా అరెస్టయిన తర్వాత జిలానీ(అక్టోబరు,2019), సాయిబాబా(అక్టోబరు2024), ఇద్దరూ చనిపోయారు. "జిలానీ నాకు పెద్దన్న లాంటి వాడు. ఆయన చనిపోయిన నెల గడచిపోయాకకానీ నాకు ఆ సంగతి తెలియలేదు. నేను జైలు నుండీ బయటకు వచ్చాక మొదటగా కలిసింది జిలానీ కుటుంబాన్నే. జిలానీ కొడుకు అతీఫ్ కు ఈ మధ్యనే పెండ్లి నిశ్చయమయింది. కూతురు విదేశాల్లో డాక్టరేట్ చేస్తున్నది"అని రోనా ఉద్వేగంగా చెప్పాడు. రోనా కూడా డాక్టరేట్ చేయాలనుకుంటున్నాడు. జేఎన్ యు లో ఎంఫిల్ పూర్తయిన తర్వాత తను డాక్టరేట్ కు కూడా నమోదు చేసుకున్నాడు. కానీ సరిగ్గా అప్పుడే పార్లమెంట్ పై దాడి కేసు విచారణ జరుగుతున్నది. "జిలానీకి మద్దతుగా రక్షణ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగించేందుకు దృష్టి పెట్టాలని నేను నిర్ణయించుకున్నాను" అని తను చెప్పాడు. ఇప్పుడు నేను బయటకు వచ్చాను. నా చదువునిక కొనసాగిస్తానని ఆయన అన్నాడు. ఇప్పటికయితే కేసు విచారణ ముగిసేదాకా, లేదా బెయిల్ నిబంధనలు మారే వరకూ తను ముంబై నగర పరిధిలోనే ఉండాల్సి ఉంటుంది. దీనికిగానూ వెస్టర్న్ సబర్బ్ లోని కమ్యూనిటీ రిట్రీట్ లో తాత్కాలికంగా నివాసాన్ని సంపాదించుకోగలిగాడు. దేశవ్యాప్తంగా ఉన్న అతని స్నేహితులు,బంధువులు అతనని కలుస్తున్నారు. కానీ వయసులో పెద్దదయిన తన అమ్మ, తను అరెస్టయినప్పటినుండి జబ్బుపడి కదలలేకుండా ఉంది. "నా అరెస్ట్ ఆమె మీద గాఢమైన ప్రభావాన్నే వేసింది. ఆమె బాగా

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతి నెల రూ.600 కోట్ల వడ్డీని చెల్లిస్తున్నాం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారన్న రేవంత్ రెడ్డి**
**ఉద్యోగులకు ఎప్పుడూ మొదటి తారీఖున వేతనాలు ఇవ్వలేదని విమర్శ**
**పదేళ్లలో కేసీఆర్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని విమర్శ**

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్

మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని, వారు చేసిన అప్పులకు ప్రతి నెల రూ.600 కోట్ల వడ్డీని చెల్లిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో పట్టభద్రులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తన పదేళ్ల కాలంలో ఉద్యోగులకు ఎప్పుడూ మొదటి తారీఖున వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు. పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలకు ఏమీ చేయని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమను తప్పుబట్టడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. ఏడాదిలోనే తాము ఏమీ చేయలేదని చెప్పడమేమిటని ప్రశ్నించారు. పదేళ్ల పాటు కేసీఆర్ నోటిఫికేషన్లు ఇవ్వలేదని, ఇచ్చిన తమపై కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే 55,163 మందికి ఉద్యోగాలు ఇచ్చిందని ఆయన వెల్లడించారు. 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు. ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే వారికి ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారని విమర్శించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు కల్పించలేదని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని పూర్తిచేశామని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ ఆశయ సాధన మేరకు తమ ప్రభుత్వం కులగణన చేపట్టిందని ఆయన అన్నారు. దేశంలో ఎవరూ చేయలేని సాహసం తాము చేశామని ఆయన అన్నారు. వందేళ్లుగా జరగని కులగణనను తాము సమర్థవంతంగా నిర్వహించామని అన్నారు. ప్రజలు తిరస్కరించినప్పటికీ కేసీఆర్‌లో మార్పు రాలేదని విమర్శించారు. కేసీఆర్ అవసరం రాష్ట్రానికి లేదని ప్రజలు తీర్పును ఇచ్చారని పేర్కొన్నారు. ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకోమని చెప్పారని వ్యాఖ్యానించారు. కానీ కేసీఆర్ మాత్రం ఫామ్ హౌస్‌లో కూర్చొని ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంతో పేగు బంధం తెంచుకొని పార్టీ పేరును కూడా మార్చుకున్నారని విమర్శించారు. ఏడాది కాలంలో తాము ఎన్నో చేశామని, వాటిని నెరవేర్చామని భావిస్తేనే తమకు ఓటు వేయాలని రేవంత్ రెడ్డి అన్నారు.

## పవిత్ర రంజాన్ కు ఏర్పాట్లను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**


హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్



పవిత్ర రంజాన్ మాసానికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వచ్చేనెల రెండో తేదీ నుండి ప్రారంభమవుతున్న రంజాన్ మాసం పై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్, పౌరసరఫరాలు, తదితర శాఖల అధికారులతో పాటు పలువురు మత పెద్దలు పాల్గొని ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ గతంలో మాదిరిగానే రంజాన్ మాసానికి అధికారులు ఏర్పాట్లను వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మార్చి రెండవ తేదీ కల్లా అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను సిద్ధం చేసి ఉంచాలన్నారు. మసీదుల వద్ద సరిపోయే తాగునీటి సౌకర్యాన్ని ఆర్డబ్ల్యూఎస్, జీడబ్ల్యూఎంసి అధికారులు కల్పించాలన్నారు. తాగునీరు అవసరమైన చోట్ల అదనంగా నీటి ట్యాంకర్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ జరగాలన్నారు. పవిత్ర మాసం కాబట్టి మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ముస్లిం ఉద్యోగులకు ఒక గంట ముందుగా ఆఫీసు నుండి వెళ్లేందుకు ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని, 24 గంటల పాటు దుకాణాలు తెరిచి ఉంటాయని తెలిపారు. శుక్రవారం, ముఖ్యమైన రోజుల్లో మసీదుల వద్ద ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, అవసరమైతే అంబులెన్స్ ను కూడా సిద్ధంగా ఉండేటట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ముందుగానే ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఆర్డీఓలు, తహసిల్దార్లు తమ పరిధిలోని మసీదులలో ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. రంజాన్ పండగకు సంబంధించిన ఏర్పాట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మత పెద్దలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లను చేస్తామన్నారు. పవిత్ర రంజాన్ ఏర్పాట్లను రెవెన్యూ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ అధికారులు హెల్ప్ లైన్ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లయితే ఏవైన సమస్యలు ఏర్పడినట్లయితే ఆ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ పరిధిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తమ శాఖ తరఫున ఏర్పాట్లను సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, నారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మురళీధర్ రెడ్డి, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ఆమ్‌జెన్ ఇండియా ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్




బయో టెక్నాలజీ రంగంలో అగ్రశ్రేణి సంస్థ ఆమ్‌జెన్ ఇండియా ఫెసిలిటీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. గత ఆగస్టులో అమెరికా పర్యటించిన సందర్భంగా ఆమ్‌జెన్ తో ప్రభుత్వం ఒప్పందం చేసుకోగా, తాజాగా మాదాపూర్‌లో ఆమ్‌జెన్ ఇండియా ఫెసిలిటీ సైట్ ను ప్రారంభించింది. ఆమ్‌జెన్ ఇండియా ఫెసిలిటీ సైట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన బయోటెక్నాలజీ కంపెనీల్లో ఒకటైన ఆమ్‌జెన్ తన మొట్టమొదటి అభివృద్ధి కేంద్రాన్ని హైదరాబాద్‌లో స్థాపించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబుతో కలిసి గత ఆగస్టులో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆమ్‌జెన్ ఆర్ అండ్ డీ సెంటర్‌ను సందర్శించినప్పుడు సైంటిఫిక్ ఇన్నొవేషన్, రీసెర్చ్, బయో టెక్నాలజీ, ఫార్మా ఆవిష్కరణలలో కంపెనీ నిబద్ధతను గమనించామని చెప్పారు. ఆమ్‌జెన్ హైదరాబాద్ రావడంతో బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఇన్నొవేషన్, టెక్నాలజీ హబ్‌గా నగరం మరింత బలపడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం లైఫ్‌సైన్సెస్, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో ముందంజలో ఉందన్నారు. ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంలో ఎదగడం, ప్రపంచంలో చైనా ప్లస్ వన్ గమ్యస్థానంగా హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా మార్చాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆమ్‌జెన్ భవిష్యత్తులో మరింత పురోభివృద్ధి సాధించడానికి అవసరమైన సహకారాన్ని అందించడానికి తెలంగాణ కట్టుబడి ఉందని చెప్పారు. పరిశోధనా రంగంలో, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, అకడమిక్ భాగస్వామ్య రంగాల్లో ఆమ్‌జెన్ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఆమ్ జెన్ చైర్మన్, సీఈఓ రాబర్ట్ ఎ. బ్రాడ్వే, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ గారు, ఆమ్‌జెన్ సీనియర్ వైస్-ప్రెసిడెంట్ డెరిక్ మిల్లర్ తో పాటు ఇతర ముఖ్యులు ప్రసంగించారు.

## ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ఏర్పాటు

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్



కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగంలో ఈరోజు భారతదేశంలో ఎలాగైతే ఇండియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ఉందో దాని లాగానే దక్షిణ భారతదేశంలో కూడా ఈ రాజనీతి శాస్త్రవేత్తలకు ఒక అసోసియేషన్ ఉండాలని కాకతీయ యూనివర్సిటీలో ఉన్న రాజనీతి శాస్త్ర అధ్యాపకులకు గత కొంతకాలంగా ఆలోచన రావడం జరిగింది. దానికి అనుకూలంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఉన్న యూనివర్సిటీలలో రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్లతో అనేక చర్చల ఫలితం ఒక పరిష్కారానికి రావడం జరిగింది. చివరగా అనేక సంప్రదింపులతో దక్షిణ భారతదేశంలో కూడా ఒక అసోసియేషన్ ఉండాలని తీర్మానించారు. దానికనుగుణంగానే సోమవారం రోజున దేశంలోనే ఒక ఆదర్శవంతమైన సంఘం ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో కాకతీయ యూనివర్సిటీలో ఉన్న రాజనీతి శాస్త్ర అధ్యాపకులు అందరితో చర్చించి ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడైన ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం లాంచనంగా ఈ సంఘాన్ని ప్రారంభించి తను మాట్లాడుతూ ఈ సంఘం ఆవిర్భావం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని, భారత దేశంలో దక్షిణాది రాష్ట్రాలకు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ సంఘం ముందు ముందు బాగా అభివృద్ధి చెందాలని మొట్ట మొదటిసారిగా ఈ సంఘాన్ని మన కాకతీయ యూనివర్సిటీలో ప్రారంభించడం అంటే దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు ఈ ప్రారంభికులకు కార్యవర్గానికి వస్తాయని తెలియజేశారు. ద్రవిడియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ కార్యవర్గంలో అధ్యక్షులుగా డాక్టర్ నాగరాజు వాడపల్లి, ఉపాధ్యక్షులుగా డా. ఎస్. సోమలింగం, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ కొమ్రయ్య పాలమాకుల, జాయింట్ సెక్రటరీ నరేష్‌కుమార్ గుడేటి, కోశాధికారి ప్రశాంత్ కల్లెపల్లి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ సంకినేని వెంకటయ్య, డా. కందగట్ల శ్రావణ్ కుమార్, గుండు సురేష్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ లీలావతి బిట్టాలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించగా సోషియాలజీ విభాగ అధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, చరిత్ర విభాగ అధిపతి డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్, రాజనీతి శాస్త్ర బిఓఎస్ డా గడ్డం కృష్ణ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బి ఓ ఎస్ డా ఆకుతోట శ్రీనివాస్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డా వడ్లకొండ సత్యనారాయణ, డా. నాగరాజు వాడపల్లి, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ ఆదిమహా విష్ణు దేవాలయంలో ఏకాదశి ప్రత్యేక పూజలు

చౌటుప్పల్ జై భీమ్ న్యూస్



చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగవరం శ్రీ ఆదిమహావిష్ణు దేవస్థానంలో సోమవారం నాడు ఏకాదశి సందర్భంగా స్వామివారికి అభిషేకము, సుదర్శన నారసింహ హోమము ప్రత్యేక పూజలు వేదంపండితులచే నిర్వహించడం జరిగింది. అదేవిదంగా దేవాలయానికి వచ్చిన రాజగోపురం నిర్మాణ దాత బొక్క భీమ్ రెడ్డి దంపతులను దేవాలయం కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి మరియు కమిటీ వారు సాధరంగా ఆహ్వానం పలికారు. చండూరు మండలం లకినేని గూడెం గ్రామ శ్రీ సీతారామ భజన మండలి వారికి స్వాగతం పలికి వారిని శాలువాలతో సత్కరించిన బొక్క భీమ్ రెడ్డి దంపతులు. భజన మండలి వారు భజన పాటలు, ఆటలతో భక్తులను ఆకట్టుకున్నారు. దేవాలయ కమిటీ సభ్యులు దేవాలయ అభివృద్ధికి సహకరించిన దాతలు, గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గట్టు సుధాకర్, సుర్కంటి మోహన్ రెడ్డి, వరకాంతం రంగారెడ్డి సురుగు శ్రీనివాస్, బొమ్మ మైసయ్య, పన్నాల రాజురెడ్డి రసాల జంగయ్య, సురుకంటి రవీందర్ రెడ్డి, పినింటి మహిపాల్ రెడ్డి, గూడూరు నర్సిరెడ్డి హరి పంతులు దేవాలయ సిబ్బంది బొమ్మ రాములు కుంటి యాదయ్య, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో హజ్రత్ సయ్యద్ మస్తాన్ షావలి ఉరుసు మహోత్సవం



సత్యసాయి జిల్లా జై భీమ్ న్యూస్ :

భూతప్ప కనుమ, జంబులబండ, గుడిబండ (మ), మడకశిర (తా), సత్యసాయి (జిల్లా) లో భూతప్ప కనుమలో హిందూ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో హజ్రత్ సయ్యద్ మస్తాన్ షావలి (రహమతుల్లా అలైహి) ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. గంధం శనివారం ఖవ్వాలి ఆదివారం జరిగింది. సర్వమత సమ్మేళనం కార్యక్రమం ముస్లిం నగారా అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. విశిష్ట అతిథిగా మాజీ శాసనసభ్యులు సుధాకర్ ఉమర్ ఫారూఖ్ ఖాన్ ప్రసంగంచారు. హజ్రత్ సయ్యద్ మస్తాన్ షావలి సూఫీ మార్గంలో శాంతి సామరస్యాన్ని పెంపొందించారని కుల మతాలకు అతీతంగా సూఫీ తత్వాన్ని ఆచరిస్తూ ప్రచారం చేస్తూ అంటరానితనం వివక్ష వైషమ్యాల నిర్మూలనకు నడుంకట్టారని మహనీయుల మార్గంలో మానవాళి నడవాలని పిలుపు నిచ్చారు. హిందూ ముస్లిం ఐక్యత కోసం నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గుడిబండకు చెందిన ఆర్.కె. నస్రుద్దీన్ సాబ్ చే గంధం సమర్పించారు, పెనుకొండ పకిర్లచే మహోత్సవం జరిగింది. ముస్తాబు అయిన స్టేజిమీద ఖవాలి కార్యక్రమము జరిగింది. పురజన ప్రముఖులు ముఖ్య అతిథులు మరియు యావన్మంది హిందు/మహ్మదీయ సోదరులు సహాయ సహకారములు అందించారు. భూతరాజు జెడ్పిటిసి గుడిబండ శ్రీనివాస్ మూర్తి (మాజీజెడ్పిటిసి) దుర్గేష్, జి.బి. శివకుమార్ మాజీ ఆర్.పి.టి.సి. బ్రదర్స్,ఈకప్ప రఫిక్,వారిస్, నాగభూషనం జంబులబండ ఖవాలి కార్యక్రమము హుసేన్ రజాఖాద్రి గుడిబండ, అమరాపురం మడకశిర మతపెద్దలు మరియు గ్రామస్థులు షాకిరా సప్లయర్ మునావీర్ సైఫుల్లా జబివుల్లా సాదత్ జిలాన్ షాబు ఇమామ్,అల్లాబకాష్ బషీర్ హజ్రత్ సయ్యద్ మస్తాన్ షావలి (రహమతుల్లా అలైహి) కమిట, దర్గా సేవకులు మరియు హిందు ముస్లిం లు తదితరులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## ఆత్మకూర్‌లో 62కిలోల గంజాయి పట్టివేత

వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్



పోలీస్ కమిషనరేట్ ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఒడిషా నుండి సూరత్ కు తరలిస్తున్న ముగ్గురు గంజాయి స్మగ్లర్ల ను అరెస్ట్ చేసిన ఆత్మకూర్ పోలీసులు అరెస్ట్ చేశారు వీరి నుండి 31లక్షల విలువైన సుమారు 62కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ముగ్గురు ఒడిషా రాష్ట్రనికి చెందిన వారిగా గుర్తించడం జరిగింది. ప్రస్తుతం మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు ఆత్మకూర్ ఇన్స్ స్పెక్టర్ సంతోష్ వెల్లడించారు.

# పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్





**కూకట్ పల్లి ఫిబ్రవరి24 (జై భీమ్ న్యూస్)**

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ సందర్శించారు. సోమవారం పాఠశాలలో ని ఏ1వన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్ ను జిల్లా విద్యాధికారి విజయ కుమారితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు సిలబస్ వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థులకు చదువు గొప్పతనం వివరించి,వారిలో ఆత్మస్థైర్యం నింపారు.కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధా పద్మజ, పిఎస్ హెడ్మాస్టర్ అనుసూయ, ఏ ఎం ఓ రవీందర్ రాజు,ఏఏపిసి స్కూల్ చైర్మన్ దుర్గాభవాని, ఉపాధ్యాయులు మోహన్ రావు,సీతాలక్ష్మి,సిద్దయ్య, విటల్ గౌడ్,శ్రీనివాస్,కిరణ్మయి, విజయలక్ష్మి,సుధారాణి,గోవిందు,గౌడుగు శ్రీనివాస్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసుపై సీఎం సంచలన వ్యాఖ్యలు

**మంచిర్యాల జిల్లా జై భీమ్ న్యూస్**

ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అంటున్నారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసును పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా వాడుకున్నారని.. గొర్రెల కుంభకోణాన్ని ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వాడు కుంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావును ఎందుకు తీసుకు రావడం లేదని బండి సంజయ్‌ను ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులను ఎప్పుడు తీసుకువస్తారో బండి సంజయ్ చెప్పాలని నిలదీశారు. గొర్రెలస్కీమ్‌లో తాము కేసులు పెడితే ఈడీ మొత్తం ఫైళ్లను తీసుకెళ్లిందని... అందులో నిందితులను ఎప్పుడు అరెస్టు చేస్తారో చెప్పాలని నిలదీశారు. సోమవారం మంచిర్యాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందకు పోటీ చేయడంలేదని సీఎం ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్‌రావులు కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పట్టభద్రులు గుండెలపైచేయి పెట్టుకుని ఆలోచించాలని కోరారు. కేసీఆర్ కుటుంబమంతా పట్టభద్రులే...మీరు ఎవరికి ఓటు వేస్తున్నారో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో జరిగిన మంతనాలు ఏమిటో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ డిపాజిట్లను పోగొట్టుకుని ఎనిమిది చోట్ల బీజేపీ ఎంపీలను గెలిపించారని ఆరోపించారు. గెలిచిన బీజేపీ ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు తెలంగాణ రాష్ట్రానికి తెచ్చింది ఏమిటో... మోదీ ఇచ్చింది ఏమిటో చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి తెలంగాణకు ఏం చేశారని నిలదీశారు. తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుమతి ఎందుకు ఇప్పించలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీకి పట్టభద్రుల ఓట్లు అడిగే హక్కు లేదు. ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి విషయంలో మేం చెప్పింది నిజమనిపిస్తే కాంగ్రెస్‌కు ఓటు వేయండి. అబద్ధమనిపిస్తే మీకిష్టమైన వారికిఓటు వేయండి. బీజేపీ నేతలకు పట్టభద్రుల ఓట్లు అడిగే హక్కు లేదు. ఐటీఐ టెక్నాలజీని ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశాం. పట్టభద్రులకు ఉద్యోగాలు రావాలని యంగ్ ఇండియా స్కిల్డ్ యూనివర్సిటిని ఏర్పాటు చేశాం. మోదీ నిర్లక్ష్యం వల్ల ఓలింపిక్‌లో ఒక్క స్వర్ణం కూడా దక్కలేదు.. అదే సౌత్ కొరియాలో 34వచ్చాయి, అందుకే మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయాలని తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ రావాలంటే పట్టభద్రుల అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేయాలి. నాడు వరి వేస్తే ఉరి అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు... మేం అధికారంలోకి రాగానే అదే రైతులకు రూ. 500బోనస్ చెల్లిస్తున్నాం. కేసీఆర్ రైతు బంధును ఎగ్గొట్టి పారిపోతే.... రూ.6వేల కోట్లకు పైగా మేము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల ఖాతాలో వేశాం. పదేళ్లలో కేసీఆర్ ఎప్పుడైనా స్వయం సహాయక సంఘాలను పట్టించుకున్నారా... .?? ఆలోచించండి. పదేళ్లు కేసీఆర్‌ను చూశారు.. రూ.7లక్షల కోట్లు అప్పు చేశారు.. ఆయన చేసిన అప్పులకు ప్రతి నెలా రూ. 6500 కోట్ల వడ్డీ కడుతున్నాం. ఏడాదికి రూ.75వేల కోట్ల భారం పడుతుంది. రాష్ట్రాన్ని నాశనం చేశాడు... కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రచారం చేస్తున్నారు... అంటే బీజేపీని గెలిపించాలనే కదా. రాష్ట్రాన్ని దివాళా తీయించి ఫామ్ హౌస్‌లో పడుకున్నాడు. నేను మోదీతో కొట్లాడుతుంటే కేసీఆర్ సందేట్లో సడే మియలా నా కాళ్లు పట్టుకుని లాగుతున్నాడు. ఇదంతా మోదీ కోసం కాదా..? నరేందర్ రెడ్డి ఒక వేళ ఓడితే కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే నష్టం లేదు. మోదీకి నిజంగా ఎస్సీలపై చిత్తశుద్ధి ఉంటే ఎందుకు పార్లమెంట్లో చట్టం చేయడం లేదు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎందుకు మోదీని అడగడం లేదు. హైదరాబాద్‌లో మెట్రో విస్తరణను అడ్డుకుంటుంది కిషన్ రెడ్డినే. మూసీ ప్రక్షాళనకు అనుమతి ఇవ్వడం లేదు. ఇదేనా నీ నీతి కిషన్ రెడ్డి. రీజనల్ రింగ్ రోడ్డు కాకుండా ఎంపీ ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి కలిసి అడ్డు పడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భార్య భర్తల మెడపై కత్తి పెట్టి చోరీకి పాల్పడ్డ దుండగులు

**కరీంనగర్ జిల్లా జై భీమ్ న్యూస్**

హుజురాబాద్లో భారీ చోరీ జరిగింది. ప్రతాపవాడకు చెందిన రాఘవరెడ్డి ఇంట్లోకి ఆదివారం రాత్రి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రాఘవరెడ్డి, అతని భార్యపై దాడి చేశారు. మెడపై కత్తులు పెట్టి బెదిరించి ఇంట్లో ఉన్న 70 తులాల బంగారు ఆభరణాలు, రూ.8 లక్షల నగదును ఎత్తుకెళ్లారు.బాధితుల చరవాణిలను తీసుకెళ్లి బయటపడేశారు. విషయం తెలుసుకొని వచ్చిన రాఘవరెడ్డి కుటుంబీకులు వచ్చి గాయపడ్డ ఇద్దరిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ తిరుమల్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేలి ముద్రలు, నిపుణులు, డ్వాగ్ స్క్వాడ్ను రంగంలోకి దింపారు. కుటుంబ సభ్యుల మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రాత్రి మూడు గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. కత్తి మెడపై పెట్టి బెదిరించారు. టవల్తో నోరు, కాళ్లు కట్టేసి దాడి చేస్తూ డబ్బులు ఎక్కడ దాచిపెట్టారో చెప్పాలన్నారు. ఇంట్లో 70 తులల బంగారం, రూ.8 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. వెంటనే మా కుమారులకు ఫోన్ చేశాను. 100 డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాను.



## కీసరగుట్ట బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ పోలీస్ కమిషనర్

**బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి సీపీ సుధీర్ బాబు ఐపీఎస్**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సావాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్ల గురించి రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ బందోబస్తు విధుల్లో ఉన్న సివిల్, ట్రాఫిక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సావాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల భద్రతా పరమైన పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, విఐపీలతో పాటు సాధారణ భక్తులకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్సును, బీపీ షుగర్ వంటి వాటితో పాటు ఇతర అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులతో పాటు బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది యొక్క క్షేమం కూడా తమకు అంతే ముఖ్యమని, పోలీసు సిబ్బంది అనుకోని పరిస్థితుల్లో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అంతేకాకుండా ప్రత్యేక వైద్య చికిత్స తీసుకుంటున్న సిబ్బందికి అవసరమయ్యే మందులు కూడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరుతో పాటు వేసవి తాపానికి కొందరు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా ఏర్పాటు చేసిన సిసిటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీం బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. భారీసంఖ్యలో భక్తులు దైవదర్శనం కోసం వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి డిసిపి పివి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, ఐటి సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఢిల్లీ సీఎం కార్యాలయం నుంచి అంబేద్కర్, భగత్ సింగ్ ఫోటోలు తొలగించారు: ఆప్ ఆరోపణ





**జై భీమ్ న్యూస్ న్యూ ఢిల్లీ :**

ఢిల్లీలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత డా. బి.ఆర్.అంబేద్కర్, భగత్ సింగ్‌ల ఫోటోలను సోమవారం ఫిబ్రవరి 24 తొలగించి వాటి స్థానంలో మహాత్మా గాంధీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోలు పెట్టారని ఆప్ ఆరోపించింది. కొత్త ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆప్ ఆరోపణను తిరస్కరించారు మరియు అంబేద్కర్ మరియు భగత్ సింగ్ ఫోటోలు నా కార్యాలయంలో ఉన్నాయని అన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కార్యాలయంలో అంబేద్కర్, భగత్ సింగ్ ఫోటోలు ఉండేవని, రేఖా గుప్తా సీఎం అయిన తర్వాత సిఎం ఆఫీస్‌లో మహాత్మా గాంధీ, రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఫోటోలు ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి అతిషి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "బీజేపీ దళిత వ్యతిరేక మనస్తత్వం అందరికీ తెలుసు. ఈరోజు దళిత వ్యతిరేక భావానికి సాక్ష్యం సమర్పించబడింది. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రభుత్వ కార్యాలయంలోని ప్రతి కార్యాలయంలో బాబాసాహెబ్ అంబేద్కర్ మరియు షహీద్ భగత్ సింగ్ ఫోటోలను ఉంచారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ రెండు ఫోటోలను తొలగించింది. బీజేపీ దళిత, సిక్కు వ్యతిరేక పార్టీ అని దీన్నిబట్టి అర్థమవుతోంది" అని అతిషి మీడియాతో అన్నారు. అంబేద్కర్ ఫోటోను తొలగించడం వల్ల లక్షలాది మంది దళిత అనుచరులు బాధపడ్డారు' అని అతిషి చేసిన ప్రకటనకు అరవింద్ కేజ్రీవాల్ మద్దతు తెలిపారు. "ఢిల్లీలోని కొత్త బీజేపీ ప్రభుత్వం బాబాసాహెబ్ ఫోటోను తొలగించి, దాని స్థానంలో ప్రధాని మోదీ ఫోటోను ఉంచింది. ఇది సరైనది కాదు. ఇది బాబాసాహెబ్ యొక్క లక్షలాది మంది అనుచరులను బాధించింది. నేను బీజేపీకి ఒక విన్నపం చేస్తాను. ప్రధాని ఫోటో పెట్టుకోవచ్చు. కానీ, బాబాసాహెబ్ ఫోటో తీయవద్దు. అతని ఫోటో ఉండనివ్వండి' అని కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొత్త ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆప్ ఆరోపణను తోసిపుచ్చారు మరియు ఢిల్లీ ప్రభుత్వం అంబేద్కర్ మరియు భగత్ సింగ్ ఫోటోలను తొలగించలేదని అన్నారు. ఆప్‌పై గుప్తా మాట్లాడుతూ, "కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ బీఆర్ అంబేద్కర్ మరియు భగత్ సింగ్‌లను ముందు ఉంచడం ద్వారా తన అవినీతి మరియు అక్రమాలను దాచిపెడుతోంది." అని అన్నారు. ఒక వీడియోలో, సీఎం రేఖా గుప్తా సీటు వెనుక మహాత్మా గాంధీ, రాష్ట్రపతి ముర్ము మరియు ప్రధాని మోదీ ఫోటోలు కనిపించాయి. అంతకుముందు అక్కడ అంబేద్కర్ మరియు భగత్ సింగ్ ఫోటోలు ఉన్నాయని ఇండియా టుడే నివేదించింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పారదర్శకత పాటించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి.**
**పీఓలు, ఏపీఓల శిక్షణ తరగతుల్లో కలెక్టర్**

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ,ఏపిఓ, సూక్ష్మ పరిశీలకుల రెండవ శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. 27వ తేదీన ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని, గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26వ తేదీన ఉదయం ప్రిసైడింగ్ అధికారులు




తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, చెక్ లిస్ట్ లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడినదా లేదా అన్నది జాగ్రత్తగా సరిచూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకున్న మీదట తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులు తీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నల్గొండలోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పి.ఓలదే అని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పి.ఓలు, ఏ.పీ.ఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి బాలకృష్ణ, సూపరిండెంట్ రంజిత్, ఎన్నికల శిక్షకులు,పిఓలు ఓపీఓ లు తదితరులు పాల్గొన్నారు.

# 27 నుంచి బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ

**బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలి**
**అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు (చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్) కనీస ప్రమాణాలు పాటించాలనీ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏ వెంకట రెడ్డి అన్నారు. సోమవారం రోజున కలెక్టరెట్ మినీకాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుచున్న బాల బాలికలకు వసతి, భోజనం, విద్యా, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను డిస్ప్లే చేయాలని సూచించారు. ఫిబ్రవరి 27 నుండి మార్చి5 వరకు జిల్లాలోని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్, ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలియచేసారు. ఈ లోగా ఆయా సంస్థలు, కొత్తగా ఏర్పాటు చేయబోయే సంస్థలకు వారి కనీస ప్రమాణాలు సంతృప్తికరంగా ఉండాలని, లేనిచో ఇన్స్పెక్షన్ కమిటీ ఇచ్చే




నివేదిక ప్రాతిపదికపై తదుపరి చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ హెల్త్ ప్రొఫైల్స్ కు సంబంధించిన ఫార్మాట్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో రూపొందించి అన్ని సంస్థలు ఒకే విధంగా హెల్త్ ప్రొఫైల్స్ నిర్వహించుటకు సులువుగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంబంధిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బాలల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని అన్నారు. డిఐవో డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులకు సమాచారం అందించి బాలల సంరక్షణ కేంద్రాల బాల బాలికలకు హెల్త్ ప్రొఫైల్ నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సందసాని రాజేంద్ర ప్రసాద్, కజాంపురం దామోదర్, బాలరక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్ అవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, డెమో వి అశోక్ రెడ్డి, డాక్టర్ ఇక్తేదార్ హమీద్ , శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ బి మాధవి, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, సిస్టర్ జెస్సీ సిరియాక్, సోషల్ వర్కర్లు జి సునీత, ఎస్ చైతన్య, ఓఆర్డబ్ల్యు పి విజయ్ కుమార్, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# పాక్-బంగ్లా మధ్య ప్రత్యక్ష వాణిజ్యం

ఢాకా : షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్తాన్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. 1971లో పాక్, బంగ్లాదేశ్‌లు విడిపోయిన తర్వాత మళ్లీ తొలిసారిగా ప్రత్యక్ష వాణిజ్యాన్ని పునఃప్రారంభించాయి. ఇందులో భాగంగా మొదటి కార్గో నౌక కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి ఢాకాకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారభంలో ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ 50,000 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు అంగీకరించడంతో ఈ ఒప్పందం ఖరారైనట్లు తెలుస్తోంది. ''1971 తర్వాత మొదటిసారిగా పాకిస్థాన్ నేషనల్ షిప్పింగ్ కార్పోరేషన్ నౌక బంగ్లాదేశ్ ఓడరేవుకు తమ ప్రభుత్వ సరుకును తీసుకెళ్తోంది. ఇది ఇరుదేశాల మధ్య సముద్ర వాణిజ్య సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తోంది'' అని పాకిస్తాన్ అధికారులు తెలిపారు. ఈ రవాణా రెండు దశల్లో పూర్తవుతుందని.. ప్రస్తుతం 25వేల టన్నుల బియ్యం తరలించామని, మరో 25,000 టన్నుల బియ్యం మార్చి ప్రారంభంలో పంపే అవకాశం ఉన్నట్లు చెప్పారు. గత ఏడాది డిసెంబర్‌లో 53 ఏళ్లలో



తొలిసారి పాక్ నుంచి నేరుగా బంగ్లాకు తొలికార్గో షిప్ వచ్చినట్లు అప్పట్లో స్థానిక మీడియా కథనాలు వెలువడ్డాయి. పనామా జెండాతో ఉన్న ఆ నౌక 811 కంటైనర్లలో సోడాయాష్, మార్బుల్ బ్లాక్, ముడివస్త్రాలు, చక్కెర, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల వంటి వాటిని తీసుకొచ్చిందని స్థానిక వార్తా సంస్థలు వెల్లడించాయి. 1971లో బంగ్లాదేశ్ తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాటి నుంచి ఇరుదేశాల మధ్య ఎటువంటి వాణిజ్య సంబంధాలు లేవు.

# టన్నెల్‌లో క్షణక్షణం ఉత్కంఠ..

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం లోపల చిక్కు కున్న వారిని రక్షించేందుకు రెండో రోజు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగి 48 గంటలు అవుతున్నా బాధితులను కాపాడటం అత్యంత క్లిష్టంగా మారింది. ఆదివారం వేకువ జాము నుంచే ఎన్డీఆర్ఎఫ్, సైన్యం బృందాలుగా లోనికి వెళ్తూ రక్షణ చర్యలు ప్రారంభించా యి. డ్రోన్లు, స్కానర్లను ఉపయోగించి సొరంగం లోపల పరిస్థితిని అంచనా వేసుకుంటూ ముందుకు వెళ్లాయి. సొరంగంలో ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతం సమీపంలోకి రక్షణ దళాలు వెళ్లాయి. ప్రమాద స్థలానికి 50 మీటర్ల దూరంలో ప్రమా ద సమయంలో అక్కడ చిక్కుకుపోయిన వారి పేర్లను పిలుస్తూ సిబ్బంది శబ్దాలు చేశారు. వీరిలో ఎవరైనా ఏదైనా ఆసరాగా చేసుకుని సాయం కోసం ఎదురు చూస్తూ ఉంటారన్న ఆశలు వ్యక్తం అయ్యాయి. మరో వైపు డ్రోన్‌తో పాటు, స్కానర్లు, నైట్ విజన్ కెమెరాలతో ఎవరైనా ఉన్నారా? అని పరిశీలించారు. 14వ కిలోమీటర్ వద్ద పనులు చేస్తున్న టన్నెల్ బోర్ మిషన్ వద్దకు చేరుకున్న కొందరు రక్షణ సభ్యులు, ఇంకా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే కటిక చీకటితో పాటు పెద్ద ఎత్తున బురద ఉండటంతో సాధ్యం కాక తిరిగి బయటకు వచ్చేశారు. అడుగడుగునా ఆటం కాలు :రక్షణ చర్యలు చేపట్టే క్రమంలో అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతున్నా యి. మట్టి, నీరు, విరిగిపడి న సెగ్మెంట్లు అడ్డు తగులు తున్నాయి. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సొరంగంలోని సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతం నుంచి 3 కిలోమీ టర్ల వరకు బురద, నీళ్లు ఎగదన్నాయని వెల్లడించా యి. ఐదు అత్యాధునిక అశ్వ సామర్థ్యం ఉన్న పంపులను వినియో గిస్తూ, ఆ నీటిని భారీ మోటార్ల ద్వారా ఎత్తిపోస్తూ శ్రీశైలం జలాశయంలోకి తరలిస్తు న్నారు. సొరంగం లోపల విద్యుత్ సరఫరా లేని చోట కూలి పోయిన ఇనుప రెయిలింగ్, రాడ్లను తొలగించేందుకు కట్టర్లు, వెల్డింగ్ పనులు చేసేందుకు విద్యుత్ అవసరం రావటంతో ఆ దిశగా చర్యలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ సమీపంలో జరుగుతున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల్లో పనులు చేస్తున్న సుమా సంస్థకు చెందిన భారీ జన రేటర్‌ను తెప్పించి శక్తివంత మైన కాంతి వెదజల్లే లైట్లను సొరంగంలో అమర్చారు. సొరంగంకు అడ్డుపడ్డ ఇనుప కడ్డీలను, పైపులను తొలగిస్తేనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లడానికి వీలు ఏర్పడుతుందని ఎన్డీఆర్ ఎఫ్ సిబ్బంది భావిస్తున్నా రు. భారీగా మట్టి, బురద ఉండటంతో సొరంగంలో చిక్కుకున్న 8 మంది సభ్యులను బయటకు తీసుకువచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై సైన్యం, ఎన్డీఆర్ఎఫ్ దళాలు, నిర్మాణ సంస్థలతో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. భూ ఉపరితలంపై నుంచి లోనికి రంధ్రాలు చేసి వెళ్లడంపై సాధ్యాసాధ్యా లను పరిశీలించారు. సొరంగం లోపలకు చేరుకోవడం అక్కడి నుంచి మట్టి, బురదను వెనక్కు వేగంగా తరలించడంపై సమాలోచనలు చేశారు. బ్లూ ప్రింట్‌లు, మ్యాప్‌ల ఆధారంగా సొరంగం ప్రాంతానికి సంబంధించిన బ్లూ ప్రింట్‌లు, మ్యాప్‌ల ఆధారంగా పరిశీలన చేపట్టారు. భారీ నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ అర్విందర్ కుమార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్?లు సైతం అక్కడి పరిస్థితులను సమీక్షించారు. మరోవైపు లోపల చిక్కుకున్న వారి కుటుంబ సభ్యులకు నిర్మాణ సంస్థ సమాచారాన్ని అందిం చింది. వారు ఇక్కడకు చేరుకోవడానికి అన్ని ఏర్పాట్లను చేసింది.

## చిక్కిన చిరుతపులి

కోలత్తూర్ : ములియార్, కరడుక్క, బెడదుక్క పంచాయతీలలో భయాందోళనలు సృష్టించిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కోలత్తూర్‌లోని చూరిక్కోడ్‌లోని నిడువొట్టు వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోనులో చిరుతపులి చిక్కుకుంది. గత నెల కోలత్తూర్‌లోని మదంతకొట్టు అడవి నుండి తప్పించుకున్న చిరుతపులి ఇదేనా అని అటవీ శాఖ దర్యాప్తు చేస్తోంది. రెండు రోజుల క్రితం కోలత్తూర్‌లోని నడిగొట్టు వద్ద చిరుతపులి బోనును ఏర్పాటు చేశారు. బోనులో కుక్కను కట్టి బోనును తయారు చేశారు. దానిని తినడానికి ఎక్కిన చిరుతపులి చిక్కుకుంది. అయితే, చిరుతపులి కుక్కను తినలేదు. రాత్రి 10 గంటలకు అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, అక్కడ చిరుతపులి ఉందని నిర్ధారించారు. సోమవారం ఉదయం చిరుతపులిని తరలించడంపై నిర్ణయం తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించడం లేదు. అటవీ శాఖ అధికారులు వలలు విస్తరించి నిఘా ఉంచుతున్నారు. శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆ ప్రాంతంలో ఒక బోను ఏర్పాటు చేసినట్లు డిఎఫ్ఓ కె అష్రఫ్ తెలియజేశారు. ఫిబ్రవరి 6న కోలత్తూర్‌లోని మదంతకోడ్ సమీపంలోని ఒక రాతి నిర్మాణంలో చిరుతపులి చిక్కుకుంది. అయితే, 7వ తేదీ ఉదయం చిరుతపులి తప్పించుకోవడం దేశంలో ఆందోళనలను రేకెత్తించింది. చాలక్కాడ్‌లోని మదంతకోడ్‌లోని వి కృష్ణన్ కవుంగు తోట సమీపంలోని రాతి నిర్మాణంలో చిరుతపులి చిక్కుకుంది. కృష్ణన్ కుమార్తె అనుపమ తోటలోకి నీరు పోయడానికి వెళ్ళినప్పుడు చిరుతపులిని చూసింది. రాతి సొరంగంలో దాక్కున్న చిరుతను అటవీ శాఖ అధికారులు రాతితో కప్పి వల విప్పారు. కన్నూర్‌లోని ఆరాలం నుండి వచ్చిన నిపుణుల బృందం రాళ్ళ మరియు వలను తొలగించి ఎరను ఏర్పాటు చేసినప్పుడు, చిరుతపులి షూటర్‌పైకి దూకింది. తర్వాత అది పొదల్లో దాక్కుంది. ఇది చిరుతపులి కాదా అనేది పరీక్ష తర్వాత మాత్రమే తెలుస్తుంది.

## అసెంబ్లీ ఎన్నికల దృష్టితోనే ప్రధాని పర్యటన

ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని ఈ కార్యక్రమానికి బీహార్‌ను ఎంచుకున్నారని ప్రతిపక్ష ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. ఈ ఆరోపణలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ తోసిపుచ్చారు. ఎన్నికల కారణంగానే ప్రధాని పర్యటన అని సూరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోడీకి ప్రచారాన్ని నిర్వహించిన రాజకీయ వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్ వ్యవహరించారు. ఇప్పుడు బీహార్‌లో ఎన్నికలు జరగబోతున్నందున, ప్రధాని రాష్ట్రంపై దృష్టి సారిస్తారనేది స్పష్టంగా ఉన్నది ప్రశాంత్ కిషోర్ అన్నారు. బిజెపి మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత, బీహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్.. మోడీ పర్యటన 'మా రాష్ట్రం.. ఆయన ప్రాధాన్యతకు రుజువు' అని అభిప్రాయపడ్డారు. ''కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో మేం చూశాం. ప్రధాని కార్యక్రమానికి హాజరు కావడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అని పాశ్వాన్ అన్నారు. స్వతంత్ర ఎంపి రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ మంగళవారం తన పూర్ణియా లోక్‌సభ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలలో 'బంద్'కు పిలుపునిచ్చారు. పూర్ణియాలో మఖానా బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను నొక్కి చెప్పడానికి ప్రయత్నించిన యాదవ్.. అవసరమైతే.. ఢిల్లీ , పూర్ణియా, కతిహార్ మధ్య రైలు రాకపోకలను అడ్డుకుంటామని కూడా హెచ్చరించారు.


All India Sampadak Sangh
PRESS
ऑल इंडिया संपादक संघ
करन कुमार- राष्ट्रीय अध्यक्ष
Karan Kumar - National President
सतीश आर्य- राष्ट्रीय सचिव
Satish Arya - National Secratory
आशीष गौतम- राष्ट्रीय उपाध्यक्ष
Ashish Gautam - National Vice President
जितेन्द्र चौधरी- राष्ट्रीय कोषाध्यक्ष
Jitendra Chaudhary - National Treasurer
ऑल इण्डिया संपादक संघ
ALL INDIA SAMPADAK SANGH
के द्वितीय स्थापना दिवस
पर समस्त देशवासियों, संपादकों एवं पत्रकार बन्धुओं
को हार्दिक बधाई एवं शुभकामनायें
Hearty Congratulations to all the Countrymen
Editors and Journalist Brothers on the Second
Foundation day of the All India Sampadak Sangh
बृजेश चौधरी- राष्ट्रीय संयोजक
Brijesh Chaudhary - National Convenor
सुरेश कुमार मौर्य- राष्ट्रीय प्रवक्ता
Suresh Kumar Maurya- National Spokesperson
विष्णु कोसरिया- राष्ट्रीय कार्यकारिणी उपाध्यक्ष
Vishnu Kosaria - National Executive Vice President
विवेक डेहरिया- राष्ट्रीय संरक्षक
Vivek Deharia - National Patron
स्वप्निल कांबले- राष्ट्रीय कार्यकारिणी सदस्य
Swapnil Kamble- National Executive Member
अविनाश बासन- राष्ट्रीय सलाहकार
Avinash Bassan - National Advisor
हिम्मत सिंह बछानिया- राष्ट्रीय कार्यकारिणी सदस्य
Himmat singh Bachhaniya- National Executive Member
Shankar Yadav Ji
Jharkhand State President
Barigela Shiv Ji
Telangana State President
Mwgthang Basumatary Ji
Assam State President
Munikrishna Ji
Karnataka State President
Puran Tamang Ji
Sikkim State President
Bhavesh Kumar Mandal Ji
Bihar State President
Brijendra Kumar Ji
Haryana State President
Pawan Gaikwad Ji
Maharastra State President
Surendra Mehra Ji
Madhya Pradesh State President
Asutosh Naik Ji
Orissa State President
Santhosh Kumar Ji
Kerala State President
Bhairulal Mali Ji
Rajasthan State President
Vijay Kumar Ji
Uttar Pradesh State President
Prakash Kumar Yadav Ji
Chhattisgarh State President
Yadati Vivekananda Reddy Yadav Ji
Andhra Pradesh State President
Gopal Singh Gautam Ji
Uttarakhand State President
Amarjeet Nishad Ji
Gujarat State President

# భారత్ ఘన విజయం

ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ రెండో విజయాన్ని నమోదు చేసింది. పరుగులయంత్రం విరాట్ కోహ్లీ(100) మరోసారి బ్యాట్ ఝులిపించి, శతకొట్టడంతో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్లతో ఘన విజయం సాధించింది. ఇక ఈ మెగాటోర్నీలో రెండో ఓటమిని చవిచూసిన పాక్ సెమీస్ ఆశలు అడియాశలయ్యాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ బ్యాటర్లను భారత బౌలర్లు ముప్పుతిప్పలు పెట్టారు. కట్టడిగా బౌలింగ్ చేసిన పాక్‌ను 242 పరుగుల తక్కువ స్కోరుకే ఆలౌట్ చేశారు. పాక్ బ్యాటర్లలో సౌద్ షకీల్ (62) హాఫ్ సెంచరీతో రాణించగా.. మహమ్మద్ రిజ్వాన్ (46), కుష్దిల్ షా(38) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్(3/40) మూడు వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా తలో వికెట్ తీసారు. హార్దిక్ పాండ్యా(2/31)కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష ఛేదనకు దిగిన టీమిండియా 42.3 ఓవర్లలో 4 వికెట్లకు 244 పరుగులు చేసి గెలుపొందింది. విరాట్ కోహ్లీ 100 (111 బంతుల్లో 7ఐ4) అజేయ శతకంతో చెలరేగగా.. శ్రేయస్ అయ్యర్ 56(67 బంతులు: 5ఐ4, 1ఐ6) హాఫ్ సెంచరీలతో రాణించారు. శుభ్‌మన్ గిల్ 46(52 బంతులు: 7ఐ4) కీలక ఇన్నింగ్స్ ఆడారు. 242 పరుగుల సాధారణ లక్ష్య ఛేదనకు దిగిన భారత్కు ఆశించిన శుభారంభం దక్కలేదు. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ దూకుడుగా ఇన్నింగ్స్ను ఆరంభించడం భారత్‌కు కలిసొచ్చింది. ఓ భారీ సిక్సర్‌తో పాటు మూడు బౌండరీలు బాది భారత ఇన్నింగ్స్‌ను ఘనంగా



ప్రారంభించాడు. పుల్ షాట్‌తో అతను కొట్టిన భారీ సిక్సర్ ఈ మ్యాచ్‌కే హైలైట్గా నిలిచింది. దూకుడుగా ఆడుతున్న రోహిత్ శర్మ(20)ను షాహిన్ షా అఫ్రిది స్టన్నింగ్ యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ క్రమంలో క్రీజులోకి విరాట్ కోహ్లీ రాగా.. శుభ్‌మన్ గిల్ దూకుడుగా ఆడి ఒత్తిడిని తగ్గించాడు. మరోవైపు విరాట్ కోహ్లీ తనదైన సింగిల్స్, క్విక్ డబుల్స్ స్ట్రైక్ రొటేట్ చేశాడు. హ్యారీస్ రౌఫ్ బౌలింగ్‌లో ట్రేడ్ మార్క్ బౌండరీలతో కోహ్లీ అంతర్జాతీయ వన్డేల్లో 14 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఇక హాఫ్ సెంచరీకి చేరువైన శుభ్‌మన్ గిల్‌ను అబ్రర్ అహ్మద్ స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 69 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

## టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ భారీ ఫీట్..

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా చైనామన్ స్పిన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ హై ప్రెజర్ మ్యాచ్‌లో కుల్దీప్ 3 వికెట్లు తీశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కుల్దీప్ 300 వికెట్లు కూడా పూర్తి చేసుకున్నాడు. దీంతో వన్డే ఇంటర్నేషనల్‌లో వికెట్ల పరంగా ఇర్ఫాన్ పఠాన్‌ను యాదవ్ వెనక్కి నెట్టాడు. గత కొన్ని రోజులుగా అతని ఫామ్ టీమ్ ఇండియాకు ఆందోళన కలిగించింది. అయితే కుల్దీప్ పాకిస్తాన్‌పై గొప్పగా పునరాగమనం చేశాడు. చైనామాన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ ఈ మ్యాచ్‌లో సల్మాన్ అఘాను తన మొదటి బాధితుడుగా చేశాడు. తర్వాతి బంతికి షాహీన్ అఫ్రిదిని అవుట్ చేశాడు. హ్యాట్రిక్ తీయడం మిస్ అయినప్పటికీ.. 9 ఓవర్లు బౌలింగ్ చేసిన కుల్దీప్ 4.40 ఎకానమీ వద్ద 40 పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ ఛాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు వచ్చినప్పుడు అతని ఖాతాలో మొత్తం 299 వికెట్లు ఉన్నాయి. 22.50 సగటుతో కుల్దీప్ ఈ వికెట్లు తీశాడు. ఈ సమయంలో అతని అత్యుత్తమ బౌలింగ్ ఫిగర్ 25 పరుగులకు ఆరు వికెట్లు. ఇది కాకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో కుల్దీప్ ఎనిమిది సార్లు ఐదు వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్‌పై కుల్‌దీప్‌కు ఎలాంటి వికెట్ దక్కలేదు. ఇదే సమయంలో పాకిస్తాన్‌పై మూడు వికెట్లు తీయడంతో అతని అంతర్జాతీయ వికెట్ల సంఖ్య 302కి చేరుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో అత్యంత చర్చనీయాంశమైన మ్యాచ్‌లో భారత్ తన బౌలర్ల అద్భుత ప్రదర్శనతో ఆదివారం 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటవడం గమనార్హం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ జట్టులో సౌద్ షకీల్ (62), మహ్మద్ రిజ్వాన్ (46) కొంత సేపు ఆడగలిగారు. భారత్ తరఫున కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు, హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు తీశారు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు అంతర్జాతీయ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ 299 వికెట్లు సాధించాడు. సల్మాన్ అఘా ఔట్ అయిన వెంటనే అతను తన 300 వికెట్లను పూర్తి చేశాడు. 2017లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన కుల్దీప్ ఇప్పటివరకు భారత్ తరఫున 109 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. ఈ సమయంలో అతను 106 ఇన్నింగ్స్‌లలో 174 వికెట్లు తీశాడు. అంతర్జాతీయ టీ20లో 40 మ్యాచుల్లో 69 వికెట్లు, టెస్టుల్లో 56




## టీమిండియాకు భారీ షాక్!

ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాపై తొలి విజయంతో జోరుమీదున్న టీమిండియాకు భారీ షాక్ తగిలింది. పాకిస్థాన్‌తో జరుగుతున్న హైఓల్టేజ్ మ్యాచ్ సందర్భంగా స్టార్ పేసర్ షమికి గాయం తిరగబెట్టినట్టు తెలుస్తోంది. మ్యాచ్ ఆరంభంలోనే షమీ మైదానం వీడాడు. తొలి స్పెల్‌లో మూడు ఓవర్లు మాత్రమే వేసిన షమీ 13 పరుగులు ఇచ్చాడు. ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో నాలుగో బంతి వేసిన అనంతరం షమీ నొప్పితో బాధపడ్డాడు. దాంతో మైదానంలోకి ఫిజియోలు రాగా.. చీల మండ ప్రదేశంలో నొప్పిగా ఉన్నట్లు వారికి షమీ సూచించాడు. ఈ ఓవర్‌ను పూర్తి చేసిన అనంతరం షమీ నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. షమీ చీలమండ గాయంతో 15 నెలల పాటు భారత జట్టుకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో చివరిసారిగా ఆడిన అతను అనంతరం చీలమండ గాయానికి శస్త్ర చికిత్స తీసుకున్నాడు. పూర్తిగా కోలుకొని మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన టి20తో సిరీస్‌లో టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఆ సిరీస్‌లో రాణించి ఛాంపియన్స్ ట్రోఫీ భారత జట్టుకు ఎంపికయ్యాడు. అదే జోరుతో ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 5 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దాంతో షమీ ఫామ్‌లోకి వచ్చాడని అంతా అనుకున్నారు. పాక్‌తో మ్యాచ్‌లోనూ అదేతరహాలో బౌలింగ్ చేశాడు. షమీ వేసిన మూడు ఓవర్లకు పాక్ బ్యాటర్లు 13 పరుగులే రాబట్టారు. తొలి ఓవర్‌లో ఐదు వైడ్స్ వేసినా.. తర్వాతి రెండు ఓవర్లలో లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేశాడు. కానీ గాయం తిరగబెట్టడంతో అసౌకర్యానికిగురైన అతను మైదానం వీడాడు.




## భారత్ వ౦ పాక్ మ్యాచ్‌కు 60 కోట్ల వ్యూస్



ఆదివారం జరిగిన చాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్ విశేష ప్రేక్షకాదరణ పొందింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఈ మ్యాచ్‌ను వీక్షించగా, జియోసినిమా మరియు స్టార్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫారమ్‌లలో 60.5 కోట్ల వ్యూస్ నమోదు అయ్యాయి. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ఆరంభం సమయంలో 6.8 కోట్ల వ్యూస్ ఉన్నా, విరాట్ కోహ్లీ తన అద్భుతమైన సెంచరీ పూర్తి చేసి భారత్‌ను విజయపథంలో నడిపేసరికి ఈ సంఖ్య 60 కోట్ల మార్క్ దాటింది. క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ మ్యాచ్‌కు ఇంతటి వ్యూస్ రాలేదని విశ్లేషకులు తెలిపారు. భారత్‌ను ఓడించేందుకు పాకిస్థాన్ జట్టు ప్రత్యేక వ్యూహాలను రచించుకుంది. రెగ్యులర్ కోచ్ అకిబ్ జావేద్‌ను పక్కన పెట్టి, మాజీ క్రికెటర్ ముదస్సర్ నాజర్‌ను స్పెషల్ కోచ్‌గా నియమించుకుంది. అయితే మ్యాచ్‌లో వారి వ్యూహాలు విఫలమయ్యాయి. సాధారణంగా పేస్ బౌలింగ్ దళంతో బలంగా కనిపించే పాకిస్థాన్ జట్టు, భారత బ్యాటింగ్ ధాటికి తట్టుకోలేకపోయింది. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ పాక్ తేలిపోయింది. ఈ ఓటమి తర్వాత క్రికెట్ విశ్లేషకులు పాక్ జట్టు ప్రణాళికలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారత్ ఘన విజయాన్ని సాధించిన నేపథ్యంలో విరాట్ కోహ్లీ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, క్రీజులో ఎక్కువ సమయం గడపాలని ముందుగానే నిర్ణయించుకున్నట్లు చెప్పారు. సహచర ఆటగాళ్లను కొనియాడుతూ, గిల్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శించాడని ప్రశంసించారు. భారత జట్టు విజయంపై రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, చిరంజీవి, లోకేశ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు భారత జట్టుకు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయాన్ని అభిమానులు కూడా అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటున్నారు.


## వన్డేల్లో చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ..




భారత్ వర్సెస్ పాకిస్థాన్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. దుబాయ్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో 14,000 పరుగులు పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌కు ముందు 35 ఏళ్ల కోహ్లీ ఈ ఘనత సాధించేందుకు 15 పరుగులు చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ వన్డేల్లో 14 వేల పరుగులు పూర్తి చేశాడు. ఈ మైలురాయిని అత్యంత వేగంగా చేరుకున్న వ్యక్తి కోహ్లీనే. 287 వన్డే ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ 14 వేల పరుగులు పూర్తి చేశాడు. ఈ విషయంలో కోహ్లీ టెండూల్కర్‌ను వెనక్కినెట్టాడు. టెండూల్కర్ 350 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించాడు. అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 14 వేల పరుగులు చేసిన ఆటగాడిగా భారత స్టార్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ నిలిచాడు. అతను సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కరలను వెనక్కి నెట్టాడు. వన్డే ఇంటర్నేషనల్‌లో 14 వేల పరుగులు చేసిన భారత్ నుంచి మూడో ఆటగాడిగా, మొత్తంగా రెండో ఆటగాడిగా నిలిచాడు. పాకిస్థాన్‌పై 15 పరుగులు చేసిన తర్వాత విరాట్ కోహ్లీ ఈ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. విరాట్ కోహ్లీ 14 వేల పరుగులు చేయడానికి 299 మ్యాచ్‌ల్లో 287 ఇన్నింగ్స్‌లు పట్టింది. సచిన్ టెండూల్కర్ 350 ఇన్నింగ్స్‌ల్లో 14 వేల పరుగులు పూర్తి చేశాడు. కాగా.. కుమార సంగక్కర 378 ఇన్నింగ్స్‌ల్లో 14 వేల పరుగులు పూర్తి చేశాడు. పాకిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఫీల్డర్‌గా కూడా నిలిచాడు. ఈ విషయంలో భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ 25 ఏళ్ల రికార్డును కింగ్ కోహ్లీ బద్దలు కొట్టాడు. అజారుద్దీన్ వన్డేల్లో 156 క్యాచ్‌లు అందుకున్నాడు. అంతర్జాతీయ వన్డేల్లో కోహ్లీ 158 క్యాచ్‌లు అందుకున్నాడు.

## విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీ అనుష్క శర్మ పోస్ట్ వైరల్ ..!

ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ పై భారత్ ఘన విజయాన్ని సాధించింది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన పోరులో టీమిండియా 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సూపర్ సెంచరీతో అదరగొట్టారు. కొంతకాలంగా తనపై వస్తున్న విమర్శలకు విరాట్ అద్భుత శతకంతో సమాధానమిచ్చారు. విరాట్ మళ్లీ ఫామ్ అందుకోవడంతో అభిమానులు జోష్‌తో సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే విరాట్ కోహ్లీ భార్య నటి అనుష్క శర్మ కూడా కింగ్ సెంచరీపై ఆనందం వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఫొటో షేర్ చేశారు. ఇండో- పాక్ మ్యాచ్‌ను ఇంటి నుంచే చూసిన అనుష్క, టీవీలో విరాట్ సెంచరీ సంబరాలను ఫొటో తీసి షేర్ చేశారు. దానికి 'లవ్', 'హైఫై' ఎమోజీలను జత చేసి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇక సెంచరీ చేసిన తర్వాత కోహ్లీ తన మెడలోని గొలుసుకున్న వెడ్డింగ్ రింగ్‌ను ముద్దాడారు. అనుష్కకు సందేశమిచ్చేలా కెమెరాకు విజయసంకేతం చూపించారు. ప్రస్తుతం అనుష్క పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.





## 'నారి' ఓ మంచి ప్రయత్నం



'మహిళల గురించి ఒక మంచి కథతో 'నారి' సినిమాను రూపొందించినట్లు ట్రైలర్‌తో తెలుస్తుంది. ట్రైలర్ చాలా బాగుంది. కొత్త ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలాంటి మంచి ప్రయత్నం చేయడం సంతోషకరం. ఆమని గారు మావిచిగురు, శుభలగం లాంటి మూవీస్‌తో తెలుగు ప్రేక్షకులకు గుర్తిండిపోయారు. మా సంస్థలో ఎంసిఎ, శ్రీనివాస కళ్యాణం మూవీస్‌లో నటించారు. 'నారి' సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని ఈ టీమ్‌కు సజెస్ట్ చేస్తున్నా. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనికరెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా 'నారి'. 'మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి' అనే కాన్సెప్ట్‌తో దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. నిర్మాతగా శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి ఏడోతేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు. శనివారంనాడు ట్రైలర్‌ను దిల్‌రాజు విడుదల చేశారు.

## 'ఓదెల2' జీవితంలో ఒకేసారి వచ్చే గొప్ప అదృష్టం



తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో బోల్డ్ న్యూ క్యారెక్టర్ పోషిస్తున్నారు. సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్‌పై డి.మధు నిర్మించిన ఈ చిత్రం ప్రతి అప్‌డేట్‌తో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రను పోషిస్తోం ది. ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో చిత్ర యూనిట్ బోట్ లో ప్రయాణించి త్రివేణి సంగమం వద్ద నాగసాధువుల సమక్షంలో టీజర్‌ను గ్రాండ్ గా లాంచ్ చేశారు. చీకటి, కాంతి యొక్క పురాతన శక్తులు ఢీకొనే ప్రపంచం నేపథ్యంలో సెట్ చేయబడిన ఈ టీజర్ సూపర్ నేచురల్ రోలర్ కోస్టర్ రైడ్ గా అద్భుతమైన కథనాన్ని చూపించింది. నాగ సా ధువు పాత్రను తమన్నా పోషించిన తీరు అద్భుతం గా ఉంది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరోయిన్ తమన్నా భాటియా మాట్లాడుతూ "మహాకుంభమేళా జీవితంలో ఒక్కసారే వస్తుంది. ఓదెల 2 సిని మా కూడా జీవితంలో ఒకేసారి వచ్చే అవకాశం. ఈ సినిమా నాకు చాలా స్పెషల్"అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్ నంది, అశోక్ తేజ, డి.మ ధు, వశిష్ట, అజనీష్ లోక్‌నాథ్ పాల్గొన్నారు.

## ఆ విషయంలో ఆటలొద్దు

తమిళులు భాష కోసం ప్రాణాలు వదిలారని, ఈ విషయంలో తమతో ఆటలొద్దని ప్రముఖ సినీనటుడు మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్‌ఎమ్) అధినేత కమల్‌హాసన్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్ఎన్ఎమ్ పార్టీ 8వ వ్యవస్థాపక దినం సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ.. తమిళులకు భాష చాలా ముఖ్యమైనదని అన్నారు. తమతో ఈ విషయంలో ఆటలొద్దు అని హెచ్చరించారు. భాష కోసం ప్రాణాలు కూడా వదిలేశామని, తమ పిల్లలకు కూడా ఏ భాష కావాలో తెలుసునని, ఏ భాష కావాలో ఎంపిక చేసుకునే జ్ఞానం వారికి ఉంది అని పరోక్షంగా కేంద్రం తీసుకువచ్చిన నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)ని ఉద్దేశించి కమల్ చురకలంటించారు. తమిళనాడులో రెండు భాషల విధానం అమలులో ఉండగా, ఎన్ఈపీ కింద హిందీతో కలిపి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది. దీనిని అధికార డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఎన్ఈపీ అమలు చేయకపోతే తమిళనాడుకు రావాల్సిన రూ.2152 కోట్ల సమగ్రశిక్షా అభియాన్ నిధులు నిలిపివేస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్ ఇప్పటికే హెచ్చరించారు. ప్రదాన్ చేసిన వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటికే ప్రధాని మోడికి లేఖ కూడా రాశారు. ఈ లేఖపై ప్రదాన్ తిరిగి స్పందించారు. తమిళనాడు ప్రభుత్వం రాజకీయాలు వదిలేసి విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించాలని సూచించారు. ఈ విషయమై తాజాగా ప్రధాని మోడి కూడా పరోక్షంగా స్పందించారు. దేశంలో భాషల పట్ల శత్రుత్వం సృష్టించొద్దని చెప్పారు.



## ముద్దు సీన్ల గురించి రీతూ వర్మ

కొందరు హీరోయిన్లు కెరీర్ ఆరంభంలో చేసే పాత్రలను బట్టి వారి మీద ఒక ట్రెడిషనల్ ముద్ర పడిపోతుంది. దీంతో ఆ తర్వాత కూడా అలాంటి పాత్రలే వస్తాయి. గ్లామర్ పాత్రలు అనగానే వీళ్లు చేయరనే అభిప్రాయం బలంగా ఉంటుంది. ముఖ్యంగా తెలుగమ్మాయిల విషయంలో ఈ ముద్ర పడడం ఎక్కువ. తన మీదా అలాంటి అభిప్రాయం ఉండిపోయిందని.. తాను చేయనేమో అనుకుని ముద్దు సీన్లు ఉన్న సినిమాలేవీ తనకు ఆఫర్ చేయట్లేదని ఓ ఇంటర్వ్యూలో రీతూ వర్మ వ్యాఖ్యానించింది. కథ డిమాండ్ చేస్తే అలాంటి పాత్రలు చేయడానికి తనకు అభ్యంతరం లేదని రీతూ చెప్పడం విశేషం. "ముద్దు సీన్లు ఉన్న సినిమాల్లో నాకు అవకాశాలు రావడం లేదు. కానీ కథకు అవసరం అనుకుంటే అలాంటి సీన్లు చేయడానికి నాకు ఇబ్బందేమీ లేదు. ఈ అమ్మాయి ఇలాంటి పాత్రలు చేయదు అని కొందరు ఒక నిర్ణయానికి వచ్చేశారు. ఆ కారణంతోనే నా దగ్గరికి అలాంటి కథలు రావడం లేదనుకుంటా" అని రీతూ పేర్కొంది. ఇక గత ఏడాది తమ టీం అంతా ఎన్నో ఆశలు పెట్టుకున్న 'స్వాగ్' సినిమా అనుకున్నంతగా ఆడకపోవడం గురించి రీతూ స్పందిస్తూ.. "మేం ఆ సినిమా చేసేటపుడే అది అందరికీ నచ్చే సినిమా కాదని అనుకున్నాం. ఒక వర్గమే దీనికి కనెక్ట్ అవుతుందనుకున్నాం. ఆ కథలోని డెప్త్ చాలామందికి అర్థం కాలేదు. కానీ ఆ విషయంలో బాధ లేదు. నేను చేసి స్పెషల్ మూవీస్‌లో 'స్వాగ్' ఒకటి. అలాంటి కథలో నటించినందుకు సంతృప్తిగా ఉంది. నటిగా నాకు అది స్పెషల్" అని చెప్పింది. తన కెరీర్‌ను మలుపు తిప్పిన 'పెళ్ళిచూపులు' చిత్రానికి తరుణ్ భాస్కర్ సీక్వెల్ తీయాలనుకుని తనను అడిగితే తప్పకుండా నటిస్తానని రీతూ చెప్పింది.

## నేరస్థుల రక్తం కళ్లజూసే 'హిట్' లాఠీ




న్యాచురల్ స్టార్ నాని నిర్మాతగా శైలేష్ కొలను దర్శకత్వంలో హిట్ 1, హిట్ 2 ఎంత పెద్ద హిట్టయ్యాయో తెలిసిందే. విశ్వక్ సేన్, అడవి శేష్ కు మంచి బ్రేక్ గా నిలిచిన ఈ సిరీస్ లో మూడో కేస్ నాని స్వయంగా టేకప్ చేయడంతో ప్రాజెక్టు ముందు నుంచి దీని మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇవాళ నాని పుట్టినరోజు సందర్భంగా టీజర్ రిలీజ్ చేశారు. మే 1 విడుదల కాబోతున్న ఈ క్రైమ్ థ్రిల్లర్ గతంలో ఎప్పుడూ చూడనంత వయొలెన్స్ ఉంటుందని టీమ్ అప్పుడప్పుడు చెబుతూనే వచ్చింది అది ఎంత మోతాదులో ఉందో ఇవాళ శాంపిల్ రూపంలో చూపించారు. ఊహించని షాకులు బోలెడిచ్చారు. ఎక్కడో కాశ్మీర్ దగ్గరలో ఒక సుదూర ప్రాంతాలు. చాలా దారుణమైన కొన్ని హత్యలు జరుగుతాయి. ఎవరు చేస్తున్నారో అర్థం కాక దీన్ని పరిష్కరించేందుకు అర్జున్ సర్కార్ (నాని) ని పిలిపిస్తారు. లాఠీనే ఆయుధంగా చేసుకునే అర్జున్ కి జాలిదయా ఉండవు. తప్పు చేసిన వాడు, నేరస్థుడు దొరికితే చాలు ఎందుకు మనిషి జన్మ ఎత్తామా అనిపించేలా చితకబాది రక్తం బయటికి తీస్తాడు. అలాంటి పోలీస్ ఆఫీసర్ కు సీరియల్ మర్డర్స్ కేస్ సవాల్ గా మారుతుంది. అప్పటిదాకా చేసిన ఆపరేషన్లకు భిన్నంగా దీనికి ఇంకా వయొలెంట్ మోడ్ లోకి వెళ్లాల్సి వస్తుంది. అసలు ఇంతకీ ఇదంతా చేసింది ఎవరనేది అసలు స్టోరీ. దసరా చాలా తక్కువనిపించే స్థాయిలో హిట్ 3 విజువల్స్ ఒళ్ళు గగుర్పొడిచేలా ఉన్నాయి. ముఖ్యంగా నాని లాఠీ పట్టుకుని విరుచుకుపడే తీరు, విలన్ల ఊచకోత కోసే వైనం సెన్సార్ నుంచి ఎలాంటి అబ్జెక్షన్స్ తెస్తుందో చూడాలి.

## వేసవి కానుకగా 'సారంగపాణి జాతకం'

సకుటుంబ సపరివార సమేతంగా చూడదగ్గ వినోదాత్మక చిత్రాలకి పేరొందిన శ్రీదేవి మూవీస్ పతాకంపై మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించిన పూర్తి నిడివి హాస్య చిత్రం 'సారంగపాణి జాతకం' వేసవి సెలవుల్లో నవ్వులు పంచడానికి సిద్ధంగా ఉంది. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన ఈ చిత్రం నుండి ఇటీవల విడుదలైన టైటిల్ సాంగ్ 'సారంగో సారంగా', 'సంచారి సంచారీ' పాటలు ట్రెండ్ అవుతుండగా, టీజర్‌లోని మాటలు, హాస్య సన్నివేశాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత భారీ అంచనాల మధ్య మోహనకృష్ణ ఇంద్రగంటి, శ్రీదేవి మూవీస్ కలయికలో మూడో చిత్రంగా విడుదలవ్వనున్న 'సారంగపాణి జాతకం' గురించి నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. "వేసవి సెలవుల్లో కుటుంబమంతా కలిసి వెళ్ళి చూసే పరిపూర్ణ హాస్యరస చిత్రం మా 'సారంగపాణి జాతకం'. మా దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి అద్భుతంగా తీశారు. ఆద్యంతం కట్టిపడేస్తూనే, వచ్చే ఎండలకి సాంత్వనలా అందరినీ అలరిస్తుందీ సినిమా" అని అన్నారు.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NUMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEE,TV.COM